ఓవైపు అప్పులు.. మరోవైపు కూతురు పెళ్లి..
బెంగతో రైతు ఆత్మహత్య



నవతెలంగాణ-దుబ్బాక

ఓవైపుకట్టుకున్న ఇంటి కోసం చేసిన అప్పులు .. మరోవైపు కన్న కూతురు పెళ్లి ఎలా చేయాలా అన్న బెంగతో ఓ రైతు ఉరేసుకొని మృతి చెందిన ఘటన అక్బర్ పేట భూంపల్లి మండలం చౌదర్ పల్లి శివార్లలో శుక్రవారం జరిగింది. భూంపల్లి ఎస్ఐ హరీష్ తెలిపిన వివరాలు.. దుబ్బాక మున్సిపల్ ధర్మాజీపేట వార్డుకు చెందిన పూరి లక్ష్మణ్ (49) వ్యవసాయం చేస్తూ నూతనంగా ఇల్లు కట్టుకున్నాడు.దానికోసం కొంత అప్పులు చేశాడు.పెళ్లీడుకొచ్చిన కూతురు ఉంది.ఆమె పెళ్లి ఎలా చేయాలి.? ఈ అప్పులు ఎలా తీర్చాలి.? అన్న బెంగ పెట్టుకున్నాడు. తరచూ ఇదే విషయమై బాధపడుతూ ఉండేవాడు.శుక్రవారం రాత్రి పొలం దగ్గరికి వెళ్ళస్తానని చెప్పి తిరిగి రాలేదు. శనివారం కుటుంబ సభ్యులు వెతుకుతుండగా బావి వద్ద ఓ చెట్టుకు ఉరేసుకుని మృతి చెందాడు.మృతుడి భార్య రేన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నవతెలంగాణ మెదక్

1

నవ్యత్ తెలుగు దినపత్రిక

ఆదివారం | 02 ఫిబ్రవరి 2025 | www.navatelangana.com

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు మృతి

నవతెలంగాణ -నంగునూరు

నంగునూరు మండలం పాలమాకుల పెద్దమ్మ దేవాలయం సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో పాలమాకుల గ్రామానికి చెందిన పిట్ల సత్యనారాయణ మృతి చెందాడు. గ్రామానికి చెందిన సత్యనారాయణ(35) రాంపూర్ క్రాసింగ్ నుంచి పనులు ముగించుకొని బైక్ పై పాలమాకులకు వస్తుండగా, జేపీ తండా చెందిన లావుడ్యా విజయ్ తన బైక్ పై పాలమాకుల నుంచి తన ఇంటికి వెళ్తుండగా పెద్దమ్మ గుడి సమీపంలో ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో సత్యనారాయణ తీవ్ర గాయాలకు గురవడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. విజయ్ కి స్వల్ప గాయాలు ఇవ్వడంతో ఆసుపత్రి తరలించారు. మృతుడు సత్యనారాయణకు భార్య, ఇద్దరు కుమారులు,ఒక కుమార్తె ఉన్నారు. మృతుని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాజగోపాల్ పేట పోలీసులు తెలిపారు.

కడుపు నొప్పి బరించలేక పోస్ట్‌మ్యాన్ ఆత్మహత్య

కేసు నమోదు చేసుకున్న పోలీసులు



నవతెలంగాణ- కొల్చారం

కడుపు నొప్పి భరించలేక పోస్ట్ మ్యాన్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రం కొల్చారంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై మహమ్మద్ గౌస్ కథనం ప్రకారం.. మండల కేంద్రం కొల్చారం తండాకు చెందిన లంబాడి రవీందర్ (27) గత కొన్నేళ్లుగా కొల్చారం పోస్ట్ ఆఫీస్‌లో బిపిఎంగా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల కాలంలో కండ్లకు పస్కలు, లివర్ చెడిపోయి కడుపులో నొప్పి వచ్చేదని తెలిపారు. కడుపు నొప్పి భరించలేక ఉదయం పురుగుల మందు సేవించిన అనంతరం విషయాన్ని భార్యకు తెలుపడంతో వెంటనే చికిత్స నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎదురెదురుగా బైకులు ఢీకొని ఒకరు

మృతి మరొకరికి గాయాలు



నవతెలంగాణ-టేక్మాల్

ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్లే లూనా ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన బోడుమెట్‌పల్లి వద్ద శనివారం సాయంత్రం ఐదు గంటలకు చోటు చేసుకుంది. మండల పరిధిలో బొడ్మట్ పల్లి జాతీయ రోడ్డు ను ఆనుకొని ఉన్న సర్వీస్ రోడ్డుపై సంఘటన చోటు చేసుకుంది. ముప్పారం గ్రామానికి చెందిన సురేందర్ (35) ముప్పారం వైపు వెళుతుండగా ఐబి తాండకు చెందిన గణపతి నాయక్ వస్తుండగా ఇరువురి బైకులు ఎదురెదురుగా ఢీకొని తీవ్రంగా గాయపడ్డారు సురేందర్ తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే స్పృహ కోల్పోయాడు. ప్రమాదంలో గాయపడిన ఇరువురిని జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో సురేందర్ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు

హెల్ప్ డెస్క్ ద్వారా ప్రజావాణి దరఖాస్తుల స్వీకరణ

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజు

నవతెలంగాణ-మెదక్

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించి .ప్రజావాణి దరఖాస్తులు హెల్ప్ డెస్క్ ద్వారా స్వీకరించనున్నామని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల విధులను కేటాయించడంతో వివిధ శాఖల అధికారులు అందుబాటులో ఉండరని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్. తెలిపారు. సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు హెల్ప్ డెస్క్ ద్వారా మాత్రమే దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలందరూ గమనించి సహకరించాలన్నారు.

ఘనంగా గంగ బోనం



నవతెలంగాణ-టేక్మాల్

టేక్మాల్ మండలం బొడ్మట్పల్లిలో కురుమ సంఘం ఆధ్వర్యంలో శ్రీ బీరప్ప స్వామి జాతర మహోత్సవ కార్యక్రమాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం గంగభోనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గంగ బోనాన్ని గ్రామంలో వీర గంధాల వేషాధారణలతో నృత్యాలు చేస్తూ, బతుకమ్మలు ఆడుతూ ఘనంగా ఊరేగించారు. గొలకుర్మలు గ్రామ శివారులోని బావిలో దాచిపెట్టిన బీరప్పస్వామి రాతి ప్రతిమలను బావిలో నుంచి వెలికితీశారు. అనంతరం విగ్రహాలను ఊరేగించి, బీరప్ప స్వామి దేవాలయం వద్ద ప్రత్యేక పూజ నిర్వహించి బోనాన్ని సమర్పించారు.

అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలి

కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాన-మెదక్

అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ నగేష్, వివిధ శాఖల అధికారులతో ఈ ఆఫీస్ విధానం, అధికారుల సమయపాలన, ప్రత్యేక అధికారులు మండలాలలో క్షేత్ర స్థాయి పర్యటనలు సంబంధిత అంశాలపై కలెక్టర్ శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ శాఖల ద్వారా ఫైల్స్ ప్రతిదీ ఈ ఆఫీస్ విధానంలోనే రావాలని మాన్యువల్ ఫైల్స్ చూడడం జరగదని చెప్పారు, ఈ ఆఫీస్ విధానాన్ని పగడ్బందీగా అమలు జరగాలని సూచించారు. ఈ ఆఫీస్ విధానం అనేది ఒక సమర్థవంతమైన పాలనకు దిక్సూచిగా పని చేస్తుందని తెలిపారు. ఈ ఆఫీసులో ఫైల్స్ పంపినప్పుడు అధికారుల దగ్గర ఎన్ని రోజులు పెండింగ్ ఉన్నాయో అనేది స్పష్టంగా తెలుస్తుందని అందువల్ల కలెక్టర్‌తో సహా ప్రతి ఆఫీసర్‌పై జవాబుదారితనం పెరుగుతుందని తెలిపారు. అధికారులు సిబ్బంది సమయ పాలన తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. ప్రత్యేక అధికా రులు మండలాల్లో క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా పర్యటించా లన్నారు. సామాజిక కార్యక్రమాల్లో, సామాజిక రుగ్మతలు నియంత్రించడంలో అధికారులు పాలొనాలన్నారు. అధికారులందరూ తుచ తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ పిడి శ్రీనివాసరావు, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డిపిఓ యాదయ్య, ఇతర శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆశించినట్టుగా 'బడ్జెట్' లేదు

ఎన్నికల కోసమే అన్నట్టుగా ఉన్నది

కేంద్ర బడ్జెట్ పై పలువురి స్పందన

నవతెలంగాణ-జహీరాబాద్/నారాయణఖేడ్‌రూరల్/సిద్దిపేటఅర్బన్

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కొత్తదనం ఏమీ లేదని.. ఢిల్లీ, బెంగాల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రకటించినట్టుగా ఉన్నదని పలువురు అభిప్రాయ వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్‌పై పలువురు భిన్నాభిప్రాయలను వ్యక్తం చేశారు. కేందద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని పలువురు అభిప్రాయపడ్డారు. నిమిదోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్.. నిరుపేద ప్రజల సంక్షేమానికి, అట్టడుగు వర్గాల అభివృద్ధికి ఏమో చేస్తారని అంద రూ భావించారని.. కానీ అనుకున్న స్థాయిలో కేటాయింపులు లేవన్నారు. రోజు రోజుకు నిత్యవసర వస్తువులు ధరలు పెరిగిపోవడంతో ప్రజలు కనీసం రెండు పూటలు కూడా భోజనం చేయలేని పరిస్థితుల్లో ఉన్నారని.. కానీ బడ్జెట్‌లో నిత్యవసర వస్తువులను తగ్గించేందుకు తీసుకున్న చర్యలు ఏమీ లేవన్నారు. ఇది జన ఆకర్షిత బడ్జెట్ మాత్రమేనని విమర్శిస్తున్నారు.

పేద ప్రజలకు ఒరిగిందేమీ లేదు



ఈ బడ్జెట్‌లో అట్టడుగు వర్గాల సంక్షేమానికి తీసుకున్న చర్యలేమీ లేవు. ఎనిమిదోసారి బడ్జెట్ను ప్రవేశపె ట్టినప్పటికీ నూతనత్వం ఏమి కూడా లేదు. వారికి మద్దతుగా నిలిచిన రాష్ట్రాల కు, పార్టీలకు లాభం చేకూరే విధంగా బడ్జెట్ ఉన్నది. నిత్య వసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు అలమటించి పోతున్నా.. వాటిని తగ్గించేందుకు బడ్జెట్లో ఏ విధమైన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

-బి.రామచందర్,
సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు

జర్నలిస్టుల సంక్షేమాన్ని మరిచారు



ఈ బడ్జెట్‌లోనైనా జర్నలిస్టుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాంయిస్తుందని ఆశిస్తే.. నిరాశే మిగిలింది. జర్నలిస్టుల సంక్షేమానికి నిధులు కేటాయించకపో వడంతో.. జర్నలిస్టుల పట్ల ప్రభుత్వానికి ఉన్న వైఖరి ఏంటో తెలుస్తున్నది.

-జె.శ్రీనివాస్ శాస్త్రి, టీడబ్ల్యూజెఎఫ్ డివిజన్ కార్యదర్శి


రాష్ట్రానికి మొండి చేయి



కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి మొండి చేయి చూపించింది. ఈ బడ్జెట్లో వేతన జీవులకు కొంత ఉపశమనం కలిగించారు. గతంలోనూ తెలంగాణకు చిల్లీగవ్వా ఇవ్వలేదు.. ఆంధ్రప్రదేశ్‌కు, బీహార్‌కు అధిక నిధులు కేటాయిం చారు. ఇప్పుడు కూడా అదే పద్ధతి అవలంభించారు. బీజేపీ మంత్రులున్నా తెలంగాణకు బడ్జెట్ తేలేదు.

- ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి

తెలంగాణ పట్ల చిన్నచూపు తగదు



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణలకు తీవ్ర అన్యాయం చేసింది. బీజేపీ ఎంపీలు తెలంగాణ నుంచి సగం మంది ఉన్నా.. తెలంగాణకు బడ్జెట్ తీసుకురాకపోవడం విడ్డురంగా ఉన్నది. కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుకో పెంచడం లేదు. తెలంగాణ రాష్ట్రాన్ని వివక్ష పూరితంగా బీజేపీ ప్రభుత్వం చూస్తున్నది.

- మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి

మహిళలకు ఏది గౌరవం?



వివిధ డ్వాక్రా సంఘాల్లో వ్యవ సాయ కూలీలు రకరకాలుగా విధులు నిర్వహిస్తున్న మహిళలకు బడ్జెట్లో ఎక్కడ కూడా ప్రాధాన్యత ఇచ్చినట్లు లేదు. నిత్యవ సర కూరగాయల ధరలు రోజురోజుకు మండిపోతున్నా పట్టించుకోవడం లేదు. ఇలా పెరిగిన ధరలతో కుటుంబ పోషణ ఎలా జరుగుతుంది.

-నర్సమ్మ, రాధిక(గృహిణులు)

ఇది కాషాయ బడ్జెట్



ఈ బడ్జెట్‌తో సామాన్య ప్రజలకు ఒరిగిందేమీ లేదు. ఇది కేవలం కొన్ని వర్గాలకు మాత్రమే ఆకర్షించేందుకు ఏర్పాటు చేసిన బడ్జెట్‌లా ఉన్నది. - వి.రాములు,ఎంపీపీ మాజీ ఉపాధ్యక్షులు

రాష్ట్రానికి కేటాయించిందేమిటీ?



ఎనిమిదోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్.. తెలంగాణ రాష్ట్రానికి నిరాశే మిగిలింది. 1000 కళ్ళతో ఎదురు చూసిన తెలంగాణ ప్రజానీకానికి కళ్ళల్లో కారం కొట్టే విధంగా చేశారు.

- ఎమ్మెల్యే మాణిక్‌రావు

ఆదాయ పన్ను పెంచడం అభినందనీయం



ఆదాయ పన్ను పరిమితి రూ.12 లక్షలకు పెంచడం ఉద్యోగస్తులకు మధ్యతరగతి ప్రజలకు చాలా సంతోషకరం. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఊతమిచ్చేల రూ.2.66 లక్షల కోట్లతో చర్యలు తీసుకోవడం మంచి పరిణామం. కిసాన్ క్రెడిట్ కార్డు లోన్ పరిమితి రూ.3 లక్షల నుంచి 5 లక్షలకు పెంచడం సంతోషకరం. బీమా రంగంలో 100శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు పెంచడం వల్ల ఈ రంగం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశిస్తున్నాం. డిజిటల్ లెర్నింగ్ వనరుల యాక్సెస్ కోసం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్నెట్ సౌకర్యం కల్పించడం శుభ పరిణామం.

-ఎస్.రాములు, అసిస్టెంట్ ప్రొఫెసర్

ఇది చమత్కార బడ్జెట్



ఇది ఓ చమత్కార బడ్జెట్ లాగా ఉన్నది. బడ్జెట్‌పై తెలంగాణ ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకుంటే.. తీవ్ర అన్యాయం జరిగింది. అలాగే బ్యాంకుల సంక్షేమానికి తీసుకున్న చర్యలేమీ లేవు.

- శివకుమార్, డీసీఎంఎస్ చైర్మెన్

కానరాని కార్మికుల సంక్షేమం



కేంద్ర బడ్జెట్‌లో కార్మికుల సంక్షేమానికి చర్యలేమీ తీసుకోలేదు. ఈఎస్ఐ, పీఎఫ్‌ల పేరా కేంద్ర ప్రభుత్వానికి లక్షల రూపాయల నిధులు ప్రతినెలా పోతున్నా.. ఆ స్థాయిలో వైద్యశాలల ఏర్పాటుకు వైద్యశాలల మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు నిధులు కేటాయించలేదు.

- మహిపాల్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి

బడ్జెట్‌లో సంగారెడ్డి జిల్లాకు అన్యాయం



కేంద్ర బడ్జెట్లో సంగారెడ్డి జిల్లా అభివృద్ధికి ఎలాంటి నిధులు కేటాయించకుండా కేంద్ర ప్రభుత్వం మరోసారి మొండి చేయి చూపించింది. రూ.50,65,345లక్షల కోట్ల బడ్జెట్లో జిల్లాకు చిల్లిగవ్వ కూడా కేటాయించకపోవడం చూస్తుంటే జిల్లా అభివృద్ధి పట్ల బీజేపీకి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతున్నది. బీహార్‌లో రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అధిక నిధులు ఆ రాష్ట్రానికే కేటాయించారు. మధ్యతరగతి జీవులకు ఉపశమనం కలిగించే ఇన్కమ్ ట్యాక్స్ లిమిట్స్‌ని రూ.15 లక్షలకు పెంచాల్సి ఉండేది. నారాయణఖేడ్ ప్రాంత సమగ్రాభివృద్ధికి కేంద్ర బడ్జెట్లో ఐదు వేల కోట్లు కేటాయించాలి. రైల్వేలైన్ కల గానే మిగిలిపోతున్నది.

- మాణిక్, సీపీఐ(ఎం)జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

కార్పొరేట్లకు లాభాలు చేకూర్చే బడ్జెట్



పార్లమెంటులో కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలపై భారాలు వేసి కార్పొరేట్లకు మేలు చేసే విధంగా ఉందని సీపీ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో పేదలను పూర్తిగా విస్మరించారని కార్పొరేట్లకు రాయితీలు కల్పిస్తూ బడ్జెట్‌ను రూపొందించారన్నారు. గత సంవత్సరం ప్రవేశపెట్టిన బడ్జెట్ కంటే 5 శాతం ఎక్కువ పెంచి బడ్జెట్ రూ.50,65,345 లక్షల కోట్ల బడ్జెట్‌ను పెట్టారని ఈ బడ్జెట్లో పేదల సంక్షేమానికి గాని, కార్మిక వర్గానికి, ఉత్పత్తి వర్గాలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. బడ్జెట్లో తెలంగాణ కు, సిద్దిపేట జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని రైల్వే లైన్ అభివృద్ధికి ఎలాంటి నిధులు కేటాయించలేదని ప్రజలకు మౌలిక సదుపాయాలు పేదరిక నిర్మూలనకు సంబంధించి కేటాయింపులు ఏమి జరపలేదని ఇది కాకులను కొట్టి గద్దలకు వేసే బడ్జెట్ లాగా ఉందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా కార్పొరేట్ల భజనమాని పేదల అభ్యున్నతి కోసం కార్మికులు గ్రామీణ పేదలు మధ్యతరగతి ప్రజలకు అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసే విధంగా బడ్జెట్ రూపొందించి అమలు చేయాలన్నారు.

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి

కేంద్ర బడ్జెట్‌లో కార్మిక వర్గానికి మొండిచేయి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జే.మల్లికార్జున్



నవతెలంగాణ-పటాన్‌చెరు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్మిక వర్గానికి మొండిచేయి చూపించిందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జే.మల్లికార్జున్ కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. సీఐటీయూ పటాన్‌చెరు కమిటీ ఆధ్వర్యంలో పటాన్‌చెరు శ్రామిక భవన్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు శనివారం ర్యాలీ నిర్వహించి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ.. నేడు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో కార్మిక రంగాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. నేడు కేంద్ర ప్రభుత్వం రూ.50.65 లక్షల కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టింద న్నారు. కానీ ఇందులో 22 శాతం లోటు బడ్జెట్ ఉందన్నారు. ఈ బడ్జెట్ ధనవంతులకు, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉందని తెలిపారు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకోసం కార్మికులకు కనీస వేతనాలు రూ.26 వేలకు పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మిక వర్గానికి హాని కలిగించే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు. ప్రస్తుతం ఉత్పత్తి రంగంలో పనిచేసే కార్మికులకు తీవ్రమైన భారాలు మోపేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధం చేస్తుందన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎనిమిది గంటల పని విధానాలనే కొనసాగించాలని, కార్మికులకు కనీస పెన్షన్ తొమ్మిది వేల రూపాయలు ఇవ్వాలని కేంద్ర ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వలన కార్మికులకు రైతులకు వ్యవసాయ కూలీలకు ఎలాంటి లాభం చేకూర్చలేదన్నారు. పెరుగుతున్న నిత్యవసర సరుకుల ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. విద్యా వైద్య రంగాలకు బడ్జెట్లో తగిన కేటాయింపులు చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వలన సామాన్య మధ్యతరగతి ప్రజానీకం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. అందుకోసం బడ్జెట్లో కార్మిక వర్గాన్ని రైతాంగాన్ని వ్యవసాయ కూలీలకు తగిన కేటాయింపులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పి.పాండురంగారెడ్డి, బి.నాగేశ్వరరావు, సీఐటీయూ నాయకులు శ్రీధర్, నరేందర్, మూర్తి, అశోక్, కార్మికులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి

రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



నవతెలంగాన-మెదక్

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్‌లను రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు.శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి గ్రాడ్యుయేట్ , టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలపై జిల్లా కలెక్టర్ లతో వీడియో సమావేశం ద్వారా సమీక్షించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అదనపు కలెక్టర్ నగేష్‌తో కలిసి ఈ వీడియో సమావేశంలో పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఉమ్మడి కరీంనగర్ , నిజామాబాద్ మెదక్, ఆదిలాబాద్ పట్టభద్రులు, టీచర్స్ శాసన మండలి సభ్యుల స్థానానికి, ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయుల స్థానానికి ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిందన్నారు.ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో ఎన్నికలు జరిగే జిల్లాల వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన హోల్డింగులు, గోడ రాతలు, జెండాలు, ప్రకటనలు తొలగించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి నిబంధనలను పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. ఫిబ్రవరి 10వ తేది వరకు నామినేషన్ల స్వీకరణ, ఫిబ్రవరి 11న స్క్రూటినీ, ఫిబ్రవరి 13 లోపు ఉపసంహరణ గడువు ఉంటుందని, ఫిబ్రవరి 27న పోలింగ్ జరుగుతుందన్నారు.

తుది జాబితాను సిద్ధం చేయాలి

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి తుది ఓటర్ల జాబితా తయారు చేయాలని, పెండింగ్ లో ఉన్న టీచర్స్, పట్టభద్రుల ఓటరు దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని సీఈఓ అధికారులకు ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అక్కడ అవసరమైన వసతులు కల్పించాలని, ఫిబ్రవరి 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో ఎన్నికల నియమావళికు సంబంధించిన నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, మెదక్ ఆర్డీవో రమాదేవి నర్సాపూర్ రెవెన్యూ డివిజన్ అధికారి మహిపాల్ రెడ్డి, తూప్రాన్ ఆర్డీవో జై చంద్ర రెడ్డి సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

బాధిత మహిళకు బంగారం అప్పగించిన పోలీసులు

తూప్రాన్ డిఎస్పి వెంకటరెడ్డి



నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ పట్టణ కేంద్రంలో ఏడు తులాల బంగారాన్ని,వెండి పట్ట గొలుసులను డీఎస్పీ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో తూప్రాన్ పోలీసులు గరుగుల శిరీషకు అందించారు. ఈ సందర్భంగా డిఎస్పి వెంకటరెడ్డి మాట్లాడుతూ హైదరాబాదులోని బాలాజీ నగర్ కు చెందిన గరుగుల శిరీష తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లికి ఫంక్షన్ కు హాజరు కావడానికి వస్తుండగా, దాదాపు ఏడు తులాల బంగారం వెండి పట్టగొలుసులు పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా వద్ద పోగొట్టుకున్నది. అనంతరం బాధిత మహిళ తూప్రాన్ పోలీస్ స్టేషన్ లో సంప్రదించగా తూప్రాన్ పిఎస్ క్రైమ్ కానిస్టేబుల్‌లు కృష్ణ సురేష్ రాజు దుర్గేశ్లు సీసీ కెమెరాల సహాయంతో పోగొట్టుకున్న బంగారు వెండి నగలను గుర్తించి, డీఎస్పీ సమక్షంలో గర్గుల శిరీష కు అప్పగించారు.ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన పిఎస్ క్రైమ్ 4 గురు కానిస్టేబుల్‌లను డిఎస్పి వెంకట్ రెడ్డి, సిఐ రంగకృష్ణ లు అభినందించిన్నట్లు తూప్రాన్ ఎస్ఐ జి.శివానందం విలేకరుల సమావేశంలో తెలిపారు.తాను పోగొట్టుకున్న బంగారం,వెండి ఆభరణలను గుర్తించి,అప్పగించినందుకు గాను బాధిత మహిళా అయినా గర్గుల శిరీష తూప్రాన్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది.

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌పై పెల్లుబికిన నిరసనలు

ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక యూనియన్ బడ్జెట్
బడ్జెట్ పత్రతుల దగ్ధం, ప్లకార్డులతో నిరసన





నవతెలంగాణ-మెదక్ టౌన్/నర్సాపూర్

కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను నిరసిస్తూ మెదక్, నర్సాపూర్ పట్టణాలలో శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో ప్లకార్డులు పట్టుకొని, బడ్జెట్ ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం మెదక్ పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ చౌరస్తా వద్ద బడ్జెట్ ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. అదేవిధంగా నర్సాపూర్ పట్టణ చౌరస్తాలో సీఐటీయూ ఆధ్వర్యంలో ప్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మెదక్ పట్టణంలో వ్యవసాయ కార్మిక సంఘం మెదక్ జిల్లా కార్యదర్శి కొరెంకల మల్లేశం, సీఐటీయూ మెదక్ జిల్లా కార్యదర్శి బసవరాజులు మాట్లాడగా, నర్సాపూర్ పట్టణంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏ. మల్లేశం, కడారి నాగరాజులు పాల్గొని మాట్లాడారు. దేశాభివృద్ధిని బలహీనపరిచే విధంగా బడ్జెట్ ప్రవేశపెట్టడం సరైనది కాదన్నారు. దేశంలో 77 కోట్ల మంది రైతులు వ్యవసాయ రంగంలో ఉన్నప్పటికీ కనీస మద్దతు ధర హామీ పదేళ్లుగా అమలు చేయలేదన్నారు. ఈ బడ్జెట్‌లో కేటాయింపులు పెంచలేదని ఆరోపించారు. ఎరువులు, విత్తనాలు, పురుగుల మందుపై సబ్సిడీలో భారీగా కోతలు విధించారు. 60 వేల కోట్ల కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల వాటాల విక్రయం ద్వారా ఆదాయం సమర్పించుకోవడం ప్రభుత్వ రంగాన్ని ధ్వంసం చేయడమేనన్నారు. కార్పొరేట్ కంపెనీలు పెట్టుబడిదారులకు రూ.2 లక్షల 14 వేల కోట్ల బకాయిలను మాఫీ చేసి ప్రభుత్వ రంగం బ్యాంకులను బలహీనపరుస్తున్నదని దుయ్యబట్టారు. నేషనల్ మానిటైజేషన్ పైప్ లైన్ స్కీమ్ పేరుతో భూములతో సహా అమ్మకానికి పెట్టి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు మరింత బలహీన పరుస్తున్నదన్నారు. పాలక పార్టీలో కార్పొరేట్ సంస్థలకు, పెట్టుబడి దారులకు బడ్జెట్‌లో సమతుల్యాన్ని లోపించడం వల్ల అనేక నష్టాలు సంభవిస్తున్నాయి. ఈ కారణాల వల్లనే నిరుద్యోగ శాతం బాగా పెరుగుతుందని వాపోయారు. శ్రామికుల నిజ వేతనాలు 20% తగ్గిపోతున్నాయి. నిత్యావసర సరుకుల ధరలు 30% నుంచి 50% వరకు పెరుగుతున్నాయన్నారు. పేదల వాస్తవ ఆదాయం 11 శాతానికి పడిపోగా బడా కార్పొరేట్ల ఆదాయం ఘనంగా 30% కంటే ఎక్కువ పెరిగిందన్నారు. దీన్ని ముక్త కంఠంతో కార్మిక వర్గం బడ్జెట్‌ని వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బీహార్‌కి వరాలు తెలంగాణకి మొండి చేయి చూపెట్టిన పరిస్థితి ఈ బడ్జెట్‌లో తేట తెల్లమయిందని విమర్శించారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర బడ్జెట్‌లో వాటా పెంచాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేస్తుందన్నారు. అదేవిధంగా కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మెదక్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు సంతోష్, సత్యం, భాను, అజయ్‌లు పాల్గొనగా, నర్సాపూర్ పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్మికులు షకూర్, గోపాల్, రవి, నగేష్, మల్లయ్య, రమేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సాగు నీటిని విడుదల చేయాలని రాస్తారోకో

-ప్రధాన రహదారిపై బైఠాయింపు
-ఇరిగేషన్ అధికారుల హామీతో విరమణ



నవతెలంగాణ-నంగునూరు

రంగనాయక సాగర్ కుడి కాలువ ద్వారా సాగు నీటిని విడుదల చేయాలని కోరుతూ శనివారం నంగునూరు మండలం సిద్దన్నపేట క్రాసింగ్ వద్ద నంగునూరు-సిద్దిపేట రహదారిపై సిద్దన్నపేట రైతులు బైఠాయించి, రాస్తారోకో చేపట్టారు. ఎండలు మొదలై నీళ్లు చాలక వేసిన పంటలు చేతికందే సమయంలో ఎండిపోయే ప్రమాదం ఉందని, తక్షణమే నీటిని విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతులు బెదురు మల్లేశం, కొలుపుల ఆంజనేయులు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిద్దన్నపేట గ్రామంలోని ఇప్పల చెరువులోకి రంగనాయక సాగర్ ద్వారా సాగు నీరు అందించేందుకు కాలువ నిర్మాణం చేపట్టడం జరిగిందని, కాలువ నిర్మాణం పూర్తి కాలేకపోవడంతో గ్రామానికి సాగు నీరు అందలేకపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సరం కూడా ఇదే సమయంలో ధర్నా చేయడం జరిగిందని, సంవత్సర కాలం నుంచి ఇరిగేషన్ అధికారులు కాలువ నిర్మాణం పూర్తి చేస్తామని చెబుతున్నారే తప్ప కాలువ పనులు పూర్తి చేయలేక పోతున్నారని మండిపడ్డారు. కాలువ మధ్యలో బండరాయి వచ్చిందని దానిని తీసేందుకు పోలీసులు పర్మిషన్ ఇవ్వడం లేదని ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో రైతులు మండిపడ్డారు. గ్రామంలోని పిల్ల కాలువలు పూర్తి చేసి నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని రైతులు కోరారు. ఈ విషయం తెలుసుకున్న రాజగోపాల్ పేట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరిగేషన్ డీఈఈ చంద్రశేఖర్‌కు ఫోన్ చేయగా కాలువలో బండరాయి ఉందని, పది రోజుల్లో పనులు పూర్తి చేసి నీటిని విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకోను విరమించారు. రైతులు బొల్లు తిరుపతి, బండి ప్రశాంత్, మహిపాల్, రమేష్, సంపత్, కైలాస్, బాబురావులు పాల్గొన్నారు.



బంజారాల అభివృద్ధికి కృషి



నవతెలంగాణ-సంగారెడ్డి

బంజారాల ఐక్యతకు, అభివృద్ధికి కృషి చేస్తానని తెలంగాణ వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యులు ఏఐబీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు రాములు నాయక్ అన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని జడ్పీ హాల్లో మార్కెట్ కమిటీ చైర్మెన్ రాంచందర్ నాయక్ ఆధ్వర్యంలో శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ.. దేశంలో, రాష్ట్రంలో బంజారాల ఐక్యతకు అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో బంజారాల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తున్నానన్నారు. సేవాలాల్ జయంతికి రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి బంజారాల కోసం ఆప్షనల్ హాలిడే జీవో తెచ్చానని త్వరలో పూర్తి సెలవు దినంగా ప్రకటించేలా చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బంజారా నాయకులు ప్రకాష్ రాథోడ్, పూల్‌సింగ్ నాయక్, మాజీ జడ్పీటీసీ రాజు రాథోడ్, అమర్ సింగ్, రాజేందర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన అదనపు కలెక్టర్



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ క్యాలెండర్‌ను జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ శనివారం ఆవిష్కరించారు. తెలంగాణ చైర్మెన్ నవోదయ సిద్ధు మాట్లాడుతూ.. జిల్లాలో మానవ హక్కుల గురించి ప్రజలని చైతన్యపరుస్తున్నామని, మానవ హక్కుల కోసం పోరాటం చేస్తున్నామన్నారు. అనంతరం కోహిర్ మండలంలోని బిలాల్‌పూర్ గ్రామానికి చెందిన బేగరి వెంకటేశం చెరుకు మిషన్ కింద గాయపడగా పరామర్శించి మనోధైర్యాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ డి.బాబు, స్టేట్ కో ఆర్డినేటర్, తలరి కుమార్ స్టేట్ సెక్రటరీ, ఆనంద్ కుమార్, బి.రవీందర్, ప్రదీప్ గారు, రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుభరోసాపై ఆందోళనలో రైతులు

నవతెలంగాణ-మనూర్

ప్రభుత్వం పెట్టుబడి సాయంగా ఇస్తున్న రైతు భరోసాపై రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొన్నది. గత నెల 26న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రైతుభరోసాతోపాటు మరో మూడు పథకాలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. ముందుగా నాగలిగిద్ద మండలంలోని ఇరకపల్లి, మనూర్ మండలంలోని దుదగొండ గ్రామాల్లో కొందరు రైతులకు ఈ భరోసా డబ్బులు ఖాతాల్లో జమ అయ్యాయి. అయితే మిగిలిన గ్రామ రైతులకు ఇప్పటివరకు డబ్బుల వేయకపోవడం.. అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం ఆ విషయంపై మాట్లాడకపోవడంతో మిగిలిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రుణమాఫీ లాగానే కొంతమందికే భరోసా డబ్బులు వేస్తారా అని బహిరంగంగానే విమర్శిస్తున్నారు. అసలు డబ్బులు వేస్తారా లేదా అని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అర్హులందరికీ రైతుభరోసా అందజేయాలని కోరుతున్నారు.

పోలీస్ స్పోర్ట్స్‌మీట్‌లో సంగారెడ్డికి అవార్డు

'తైక్వాండా'లో సిల్వర్ మేడల్ సాధించిన ఐటీ కోర్ టీం గంగేరి సంతోష్ కుమార్



నవతెలంగాణ-సంగారెడ్డి

తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్-2025లో భాగంగా జనవరి 28 నుండి ఫిబ్రవరి 1 వరకు కరీంనగర్‌లో నిర్వహించిన పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో సంగారెడ్డి జిల్లా ఐటి కోర్ గంగేరి సంతోష్‌కుమార్ తైక్వావండోలో సిల్వర్ మేడల్ సాధించాడు. సిల్వర్ మేడల్ సాధించిన గంగేరి సంతోష్ కుమార్‌కు కోచ్ ప్రశంసా పత్రం సిల్వర్ మేడల్ అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్ కుమార్ , తదితరులు పాల్గొన్నారు.



పెండింగ్ వేతనాల కోసం 'ఉపాధి' సిబ్బంది సమ్మె

నవతెలంగాణ-జహీరాబాద్

పెండింగ్‌లో ఉన్న తమ వేతనాలను వెంటనే చెల్లించాలని.. లేనియెడల సమ్మెను ఉధృతం చేస్తామని ఉపాధి హామీ సిబ్బంది మొగుడంపల్లి ఎంపీడీవో, ఎంపీఓలకు శనివారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెండింగ్ వేతనాలు, వెంటనే అమలు చేయాలని లేని యెడల శాంతియుత నిరసనలు, సమ్మె చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో గుమ్మడిదల మాజీ సర్పంచ్ మృతి



నవతెలంగాణ-గుమ్మడిదల

కాంగ్రెస్ నాయకులు, గుమ్మడిదల మాజీ సర్పంచ్ గోస్కొండ నారాయణరెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. ఉమ్మడి జిన్నారం మండలంలో కాంగ్రెస్ పార్టీలో కీలక పాత్ర పోషిస్తూ గ్రామాభివృద్ధి కి తోడ్పాటు అందించారు.గుమ్మడిదల గ్రామానికి ఎనలేని సేవ చేసి ఆయన గత కొన్ని నెలల నుండి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. కాగా తను చేసిన సేవలు చిరస్థాయిగా గుర్తించుకునే విధంగా ఉన్నాయని పలువురు గ్రామ పెద్దలు కొనియాడారు. మాజీ ప్రజా ప్రతినిధులు వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ సంతాపం వ్యక్తం చేశారు.



అంబేద్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు బాధాకరం

నవతెలంగాణ-జహీరాబాద్

బాబాసాహెబ్ అంబేద్కర్ రచనలు ప్రపంచవ్యాప్తంగా మన్ననలు పొందుతుంటే.. మనదేశంలోని కేంద్ర మంత్రులు అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని.. ప్రజాక్షేత్రంలో వారికి ఓటమి తప్పదని స్టడీ సర్కిల్ వ్యవస్థాపక అధ్యక్షులు మొగులయ్య గౌతమ్ అన్నారు. జహీరాబాద్ పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో డాక్టర్ బాబాసాహెబ్ భీమ్రావు అంబేద్కర్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళితులు, గిరిజనులు, మైనార్టీల పట్ల రోజురోజుకు దాడులతో పాటు.. వారి ఆస్తుల పైన కూడా దాడులు జరగడం సిగ్గు చేటన్నారు. ఇప్పటికైనా అట్టడుగు వర్గాల వారు ఐక్యంగా ఉండాలని.. ఉద్యమాలతోనే విజయాన్ని సాధించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో స్టడీ సర్కిల్ డివిజన్ అధ్యక్షులు డి.శ్రీనివాస్ బిచ్చయ్య. విట్టల్, రామ్ చందర్, భీమ్ వంశీ, పట్టణ అధ్యక్షులు బి.మచందర్, క్యాషియర్ శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీ వై.శ్రీనివాస్, గోపాల్, సుభాష్, ఆకాష్ దిలీప్, ఉపాధ్యక్షులు నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం



నవతెలంగాణ-హత్నూర

పార్లమెంట్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు మరోసారి తీవ్ర అన్యాయం జరిగిందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు యం.డి అజీజ్ మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణకు ఇండియన్ ఐఐఎం, ట్రిపుల్ ఐటీ, నవోదయ, సైనిక్ స్కూల్స్ ఇవ్వాలని ఎప్పటినుంచో డిమాండ్ ఉన్నప్పటికీ.. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో వాటి ప్రస్తావనే లేవనెత్తకపోవడం సిగ్గుచేటన్నారు. తెలంగాణలో బీజేపీ పార్టీ నుంచి 8 మంది ఎంపీలున్నా రాష్ట్ర బడ్జెట్ విషయంలో ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం ఏంటని ప్రశ్నించారు. త్వరలో ఎన్నికలు జరిగే బీహార్ రాష్ట్రానికి మాత్రం వరాలు జల్లు ప్రకటించడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నట్టు చెప్పారు. ఏ రాష్ట్రంలో ఎన్నికలుంటే ఆ రాష్ట్రాలలో ఓట్లు ఆర్జించుకోవడం కోసం నిధులు ప్రకటించడం దుర్మార్గమన్నారు. పదేళ్లుగా ప్రధాని నరేంద్ర మోడీ తెలం గాణ రాష్ట్రానికి చేసింది శూన్యమేనని ఎద్దేవా చేశారు.

నేటి నుంచే వెంకటేశ్వర స్వామి ఆలయ జాతర



నవతెలంగాణ-చౌటకూర్

పుల్కల్ మండలంలోని సింగూర్ గ్రామంలో గత కొన్నేండ్లుగా శ్రీశ్రీశ్రీ కళ్యాణ సుందర వెంకటేశ్వర స్వామి ఆలయ జాతరను ప్రతీయేడు ఘనంగా నిర్వహిస్తున్నామని పూజారి శ్రీనివాసాచార్యులు తెలిపారు. కాగా ఈ యేడు నేటి నుంచి ప్రారంభం కానున్న 38వ బ్రహ్మోత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేశామన్నారు. నేటి నుంచి 5వ తేదీ వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఈ జాతరకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

సరిహద్దులు దాటుతున్న ఎర్రరాయి



- ఇష్టారాజ్యంగా తవ్వకాలు
- జరిమానాలు విధిస్తున్నా మారని తీరు

నవతెలంగాణ-న్యాల్‌కల్

సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని గణేష్‌పూర్ గ్రామ శివారు, సరిహద్దు ప్రాంతంలో ఎర్రరాయి గనుల్లో తవ్వకాలు ఇష్టారాజ్యంగా జరుగు తున్నాయి. పచ్చని వ్యవసాయ భూముల్లో తవ్వకాలు చేపట్టి గుంతలుగా చేసి వదిలేస్తున్నారు. రాత్రి వేళల్లో పెద్దఎత్తున ఈ మాఫియా జరుగు తున్నది. ప్రభుత్వ నిష్ భూముల్లో ఎర్రరాయి తవ్వకాలు చేపడుతున్నా.. రెవెన్యూ, మైనింగ్ అధికారులు తూతూమంత్రంగా దాడులు చేసి వదిలేస్తున్నారని స్థానికంగా విమర్శలు వస్తున్నాయి. కాగా ఈ తవ్వకాల వల్ల ఏర్పడిన పెద్ద పెద్ద గుంతలు రైతులకు ప్రమాదకరంగా మారుతున్నాయి. అక్రమంగా తవ్వకాలు చేపట్టి.. ఎర్రరాయిని సరిహద్దు దాటిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. కర్ణాటక సరిహ ద్దులతోపాటు, అందోల్, నారాయణఖేడ్, పట్టణాలకు ట్రాక్ట ర్లు, లారీల్లో రాత్రి వేళల్లో ఎర్రరాయిని తరలిస్తున్నారని పలు వురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి.. ఈ దందాను అడ్డుకోవాలని కోరుతున్నారు.

మాల ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశం జయప్రదం చేయాలి

నవతెలంగాణ-సంగారెడ్డి

నేటి మాల ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశం జయప్రదం చేయాలని మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు దళితరత్న డాక్టర్ బి జనార్దన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంగారెడ్డి అంబేద్కర్ భవన్లో ఉదయం 10: 30 గంటలకు తెలంగాణ మాల ఉద్యోగుల సంఘం ప్రథమ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సమావే శంలో భారత రాజ్యాంగం, రిజర్వేషన్లు, ఉద్యోగులు, సమాజం బాధ్యత, ఐక్యమత్యం అనే అంశంపై ముఖ్యఅతిథుల ప్రసంగాలు ఉంటాయన్నారు. అనంతరం సంఘం చేపట్టిన కార్యక్రమాలు ఉద్యమాలపై సూచనలు అభిప్రాయాలు పొందిన అనంతరం తగిన నిర్ణయాలు తీసుకుంటారన్నారు. కాబట్టి జిల్లాలోని మాల అనుబంధ కులాల ప్రభుత్వ ప్రయివేటు ఉద్యోగులు, వృత్తి నిపుణులు, సొంత వ్యాపారస్తులు, సోదర సోదరీమణులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు చెన్నూరు ఎమ్మెల్యే జి.వివేక్ వెంకటస్వామి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు, మూర్తి, మాల మనవడు జాతీయ అధ్యక్షులు జి. చెన్నయ్య మల్లేపల్లి లక్ష్మయ్య ప్రముఖ నాయకులు హాజరవుతారన్నారు.

బడ్జెట్‌లో తెలంగాణ పట్ల పక్షపాత ధోరణి

- సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



నవతెలంగాణ-సంగారెడ్డి

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వం పక్షపాత ధోరణి చూపిందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్ తూర్పు రాష్ట్రాలకు వెళ్లిందని.. దక్షిణాది రాష్ట్రాల వైపు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి చూడలేదని మండిపడ్డారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణ ప్రభుత్వంపై పక్షపాతం చూపుతున్నదన్నారు.రాష్ట్రానికి బడ్జెట్ లో నిధులు కేటాయించకపోతే రాష్ట్రం ఎలా అభివృద్ధి చెందుతుందని ప్రశ్నించారు. తెలంగాణ ఎంపీలు ఏం చేస్తున్నారన్నారు. తెలంగాణ ప్రజలకు బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణలోని ఒక్క ప్రాజెక్టులకు బడ్జెట్‌లో కేటాయింపులు లేవన్నారు.పబ్లిక్ సెక్టార్ స్థానంలో ఉపాధి కల్పన కోసం చిన్న తరహా, మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహం ఇవ్వాలన్నారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి కేంద్ర బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇవ్వలేదన్నారు. విద్యా ఉపాధి అవకాశాలతోనే పేదరికాన్ని రూపుమాపొచ్చు.. కానీ వాటికి బడ్జెట్ లో ప్రాధాన్యం లేదన్నారు. టీఎన్జీవోస్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు మామిళ్ళ రాజేందర్, శ్రావణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలు మరిచారు



నవతెలంగాణ-జహీరాబాద్

కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల ముందు ఎన్నో హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలు మరిచారని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ వై.నరోత్తం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఎన్నో హామీలు ఇచ్చిందని.. అందులో 6 గ్యారంటీలు, 13 హామీలు వెంటనే అమలు పరుస్తామని చెప్పిందన్నారు. అయితే ఒక్క మినహా మిగతా వాటిని అమలు చేయలే దన్నారు. రైతుబంధును రైతు భరోసాగా మార్చి ఎకరాకు రూ.15000 ఇస్తామన్నారని.. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా అమలు మాత్రం చేయలేదన్నారు. రాష్ట్రం మొత్తంలో 12991 గ్రామాల్లో 70 లక్షల వరకు రైతులు ఉన్నారని.. 2 కోట్ల 20 లక్షల సాగు భూమి ఉన్నదన్నారు. అయితే ప్రభుత్వం దానిని కోటి 50 లక్షల ఎకరాలకు కుదించిందన్నారు. వాటికి రూ.22500 కోట్లు చెల్లించాలన్నారు. కానీ రూ.15000ను రూ.12000 కు కుదించి.. రూ.4500కోట్లు తగ్గించారన్నారు. గత నెల 26న ఈ పథకం అందరికి అమలు చేస్తామని చెప్పి.. కేవలం 561 గ్రామాలను అంటే మండలానికి ఒక గ్రామం ఎంపిక చేసి 4లక్షల 42 వేల రైతులకు ఎకరానికి రూ. 6000 చొప్పున అందజేశారన్నారు. అంటే ఇంకా 12430 గ్రామాల్లో 65 లక్షల 58 వేల రైతులకు రైతుభరోసా ఇవ్వాల్సి ఉన్నదన్నారు. జహీరాబాద్ నియోజకవర్గానికి వస్తే జహీరాబాద్, ఝరాసంఘం,న్యాల్ కల్, కోహీర్, మొగుడంపల్లి,మండలాల్లో మొత్తం 143 గ్రామాలు ఉండగా 88167 మంది రైతులకు సుమారు రూ.123 కోట్లు ఇవ్వాల్సి ఉండగా కేవలం మండలానికి ఒక గ్రామం ఎంపిక చేసి 6136 మంది రైతులకు మాత్రమే రూ.8.8 కోట్లు విడుదల చేశారన్నారు. ఎన్నికల కోడ్ చెప్పి మిగతవారికి వేయకుండా తప్పించుకుంటారన్నారు.

పద్మభూషణ్ బాలకృష్ణకు అభినందనలు



నవతెలంగాణ-రామచంద్రాపురం

సినీ నటుడు నందమూరి బాలకృష్ణకు కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డును ప్రకటించడంతో రామచంద్రాపురంలోని నందమూరి అసోసియేషన్ సభ్యులు అభిమానులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామచంద్రాపురం పట్టణంలో శనివారం నందమూరి అసోసియేషన్ అధ్యక్షులు బికే యాదయ్య మాట్లాడుతూ.. నందమూరి బాలకృష్ణ 50 సంవత్సరాలుగా సినీ పరిశ్రమలో నటనా ప్రావిణ్యాన్ని ప్రదర్శిస్తూ బసవతారక క్యాన్సర్ ఆసుపత్రి చైర్మెన్‌గాను ప్రజలకు ఎన్నో సేవలు చేస్తున్నాడన్నారు. కళాకారుడిగా, రాజకీయ నాయకుడిగా, క్యాన్సర్ రోగులకు అభయ హస్తం ఇస్తూ ఎందరికో సేవలు అందిస్తున్న నందమూరి బాలకృష్ణను కేంద్ర ప్రభుత్వం గౌరవించి పద్మభూషణ్ అవార్డును ఇవ్వడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తున్నదన్నారు. బాలకృష్ణ మరెన్నో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నందమూరి అభిమాన సంఘం సభ్యులు నాగేష్, నరసింహ, బీరప్ప, శివరాజ్, శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై డీడీఎస్ కృషి అభినందనీయం



నవతెలంగాణ-జహీరాబాద్

చిరుధాన్యాల పంట సాగుపై డీడీఎస్ సంస్థ చేస్తున్న కృషి ఎంతో అభినందనీయమని శేఖాపూర్ మాజీ ఎంపీటీసీ నర్సింలు అన్నారు. జహీరాబాద్ మండలంలోని శేఖాపూర్ గ్రామంలో పాత పంటల జాతరకు శనివారం ఘన స్వాగతం పలికారు. డప్పు వాయిద్యాలతో పాత పంటల జాతర బండ్లకు స్వాగతం పలికి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామపంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నర్సింలు మాట్లాడుతూ.. పంట సాగు విధానంతో పాటు.. పండిన పంటలను మార్కెట్‌కు తరలించి డబ్బులు సంపాదించేందుకు కావాల్సిన సహకారాలన్నీ డీడీఎస్ సంఘం చేస్తున్నదని.. అందుకే తాము జాతర పట్ల ఆకర్షితులైనట్టు చెప్పారు. తమ గ్రామం, తాండాల్లో ఉన్న చిన్న చిన్న పొలాలను సైతం పట్టణంలోని సాఫ్ట్వేర్ ఉద్యోగులు దత్తత తీసుకొని.. తాము పండిస్తున్న పంటలకు ఆర్థిక సాయాన్ని అందజేస్తున్నారన్నారు. పంటలను సైతం వారు తీసుకుపోవడంతో తమకు ఆర్థిక భరోసా కలుగుతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో జాతర సభ్యులు మాణిక్యం నరసమ్మ జనరల్ నరసమ్మ ,అల్గోల్ నరసమ్మ రుకీబాయి, సోనీ బాయి, ఝాన్సీ బాయ్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో సీనియర్ ఉపాధ్యాయులకు ప్రయోజనం లేదు



నవతెలంగాణ-సంగారెడ్డి

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ 2025లో ఆదాయపు పన్ను మినహాయింపులు, స్లాబులు పెంచినప్పటికీ, సీనియర్ ఉపాధ్యాయులకు పెద్దగా ప్రయోజనం లేదని ఎస్టీయూటీఎస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సయ్యద్ సాబేర్ అలీ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస రాథోడ్ లు ఒక శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ బడ్జెట్లో 12 నెలల గ్రాస్ సాలరీ నుండి రూ.75,000 స్టాండర్డ్ డిడక్షన్ తీసివేస్తే వచ్చే ఆదాయం 12 లక్షల లోపు ఉంటే టాక్స్ నుండి మినహాయింపు పొందుతారన్నారు. కొత్త పన్ను విధా నంలో టాక్స్ రిబేట్‌ను రూ.25,000 నుంచి రూ.60,000కు పెంచారన్నారు. పన్ను విధించదగిన ఆదాయం టాక్స్ ఏబుల్ ఇన్కమ్ 12 లక్షల లోపల ఉన్న వారికి ఈ రిబేట్ వర్తిస్తుందని వివరించారు. రాబోయే ఐదేళ్లలో దేశ వ్యాప్తంగా డిజి టల్ లెర్నింగ్ వనరుల యాక్సెస్ కోసం 50 వేల పాఠశాలల్లో 'అటల్ టింకరి ంగ్ ల్యాబ్స్' నెలకొలపడానికి నిర్ణయం ప్రకటించడం హర్షనీయమన్నారు. ఇవి విద్యార్థులలో ఆసక్తి, సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథం పెంచుతాయన్నారు. అన్ని ప్రభుత్వ హైస్కూల్‌లకు బ్రాడ్ బ్యాండ్ సేవలు, స్కూలు విద్యతోపాటు నైపుణ్య శిక్షణ సౌకర్యం కల్పిస్తామని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

డ్రయినేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తా



నవతెలంగాణ-రామచంద్రాపురం

రామచంద్రాపురం డివిజన్ శ్రీనివాస్‌నగర్ కాలనీ 14,15వ బ్లాక్‌లలో ఉన్న సమస్యల పరిష్కారానికి జీహెచ్ఎంసి ఇంజనీరింగ్ ఏఈ దివ్య జ్యోతి, జలమండలి అధికారులు నాయక్‌తో కలిసి స్థానిక కార్పొరేటర్ పుష్ప నగేష్ శనివారం బస్తీ దర్శన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బస్తీలో గతంలో ఎప్పుడో వేసిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ వల్ల ప్రతి రోజు డ్రైనేజీ నీరు రోడ్ల మీద పొంగి పొర్లుతున్నాయని.. దాంతో చాలా అనారోగ్య సమస్యలు వచ్చి ఇబ్బంది పాలవుతున్నామని బస్తి వాసులు కార్పొరేటర్‌కు విజ్ఞప్తి చేశారు. కార్పొరేటర్ స్పందిస్తూ వెంటనే నూతన ప్రతిపాదనలు సిద్ధం చేసి పైప్‌లైన్ ఏర్పాటు చేసేందుకు జల మండలి అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. అలాగే సీసీరోడ్ కొరకు కూడా ప్రతిపాదనలు చెయ్యాలి అని జీహెచ్ఎంసి ఇంజనీరింగ్ అధికారులను కార్పొరేటర్ కోరారు. ఈ కార్యక్రమంలో పీటర్ సామ్యూల్, సామ్యూల్ వినయ్ కుమార్, మైనారిటీ అధ్యక్షులు మహమ్మద్ హబీబ్, సావ్రాట్, శాంతమ్మ, చాకలి నర్సింహ, సీఎం మల్లేష్, శ్రీకాంత్ నాయక్, శివ కుమార్, హన్మంతు, బైకాన్ నవీన్ యాదవ్, ఈర్ల మహేష్, గోపి, బలరాం తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సంఖ్యను పెంచాలి



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ పట్టణంలో అధిక సంఖ్యలో కొత్త కాలనీలు ఏర్పడ్డాయని కాబట్టి మున్సిపల్ వర్కర్స్ సంఖ్య పెంచాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ.. నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలో అధిక సంఖ్యలో కొత్త కాలనీలో ఏర్పడడంతో పట్టణం మరింత అభివృద్ధి దశలో వెళ్తున్నదన్నారు. అయితే మున్సిపాల్టీలో తక్కువ వర్కర్స్ ఉండడంతో పనిభారం పెరగడంతో వర్కర్స్ అనారోగ్యం పాలవుతున్నారన్నారు. కాబట్టి మున్సిపల్ పట్టణానికి అనుకూలంగా మరో 20 మంది వర్కర్లను నియమించాలన్నారు. నలుగురు చేయాల్సిన పని ఇద్దరే చేయడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. చాలా మంది గతంలో పని మానేసిన పరిస్థితి ఉందన్నారు. వర్కర్లకు నెలవారీగా సబ్బులు, సరుపులు అందించాలన్నారు. పెరిగిన ధరలకు అనుకూలంగా వేతనాలు పెంచాలన్నారు. జిల్లాలో అన్ని మున్సిపాల్టీ పరిధిలో భాగంగా ఒక్క పూట పని జరుగుతుందని నారాయణఖేడ్ పట్టణంలో కూడా ఒక్క పూట పని చేపించాలన్నారు.ఈనెల 10 నుంచి ఒక్క పూట పని పెడతామని.. ప్రతి నెల సరుకులు అందే విధంగా చూస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. వర్కర్లకు పనిభారం పెంచకుండా వర్కర్ల సంఖ్య పెంచు కోవాలని కోరడంతో వర్కర్లను పెంచుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సి పల్ అధ్యక్ష కార్యదర్శులు శకుంతల కుమార్, కోశాధికారి సిద్దమ్మ, ఉపాధ్యక్షులు సుధాకర్, ఏసు సుశీల, మరియమ్మ, బేబీ సాయమ్మ, సాయిలు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల మార్కెట్ స్థానంలో 'రైతు బజార్' స్థాపించాలి



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణం నడిబొడులో ఉన్న పశువుల సంతను అక్కడి నుంచి తొలగించి.. ఆ స్థలంలో రైతుబజార్లు ఏర్పాటు చేయాలని జహీరాబాద్ పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త డా. జాన్ నిసార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, జిల్లా కలెక్టర్, ఎస్పీలకు, మార్కెటింగ్ శాఖ అధికారులకు ఉత్తరాలు రాసినట్లు తెలిపారు. ఆ పత్రాలను ఆర్డిఓ రామ్ రెడ్డికి అందజేశామన్నారు. పశువుల సంత పట్టణ నడిబొడ్డున ఉండటంతో తరచు ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. పశువులు ఇండ్లలోకి చొరబడడంతో రకరకాల ఇబ్బందులు జరుగుతున్నాయన్నారు. ఈ పశువుల సంతను ఇతర ప్రాంతానికి తరలించి ఈ స్థలంలో రైతు బజార్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈవినతి పత్రాలను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ మంత్రి, ఆరోగ్య మంత్రి, వ్యవసాయ మార్కెటింగ్ డిపార్ట్మెంట్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ మొదలైన కీలక అధికారులకు పంపారు.ఈ కార్యక్రమంలో ఘౌస్ ఉద్దీన్ బాబా పటేల్ జనరల్ సెక్రటరీ - మైనారిటీ సెల్, మొహమ్మద్ అక్బర్,.డి. అయూబ్, అయూబ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ భవాని నాగరత్నం గౌడ్‌కు సన్మానం



నవతెలంగాణ -జోగిపేట

అందోల్-జోగిపేట మున్సిపాల్టీ పరిధిలోని 8వ వార్డు మాజీ కౌన్సిలర్ రాచకొండ భవాని నాగరత్నం గౌడ్ గత పదేండ్లుగా తమ సేవలను అందించి, పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం 8వ వార్డు పరిధిలోని బీసీ కాలనీ యువకులు శాలువా, పూలమాలలు, మెమొంటోతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ భవాని నాగరత్నం గౌడ్ మాట్లాడుతూ.. పదేండ్ల కాలంలో వార్డులో రూ.కోటి 50 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. కౌన్సిలర్‌గా గెలిచిన రోజున వార్డులో ఒక్క సీసీ రోడ్డు కూడా లేదని, నీళ్ల సమస్య ఉందన్నారు. కానీ వాటన్నింటిని పరిష్కరించామన్నారు. ప్రతీ వీధిలో సీసీం రోడ్లు, మురికి కాలువలు, కరెంటు స్తంభాలు, ఐమాక్స్ లైట్లు, ఏర్పరుచుకున్నామన్నారు. నీటి సమస్యను వందశాతం పూర్తి చేయడం జరిగిందన్నారు. రెండుసార్లు కౌన్సిలర్‌గా అవకాశం ఇచ్చిన వార్డు ప్రజలకు, మాజీ ఎమ్మెల్యేలు బాబు మోహన్, చంటి క్రాంతి కిరణ్, బీఆర్ఎస్ నాయకులు పట్లోళ్ల జైపాల్ రెడ్డి, మఠం బిక్షపతి ,పార్టీ పెద్దలకు, ఎనిమిదోవార్డు ప్రజలకు ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

'వేల గొంతులు.. లక్ష డప్పులు'కు తరలిరావాలి



నవతెలంగాణ-హత్నూర

ఎస్సీ వర్గీకరణ అమలు కోసం హైదరాబాదులో జరిగే 'వేల గొంతులు.. లక్ష డప్పుల' మాదిగల భారీ సాంస్కృతిక ప్రదర్శనను విజయవంతం చేయాలని మండల పరిధిలోని దౌల్తాబాద్‌లో సంబంధిత వాల్ పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా, ఎంఎస్‌పి జిల్లా కార్యదర్శి గందగళ్ళ ప్రసాద్ మాదిగ హాజరై మాట్లాడుతూ.. ఈ మహా ప్రదర్శన ర్యాలీ ఎల్బీ స్టేడియం నుంచి పెద్ద అంబేద్కర్ వరకు కొనసాగుతుందన్నారు. ప్రతీ మాదిగ బిడ్డ సంకన డప్పు వేసుకొని వేల సంఖ్యలో బయలుదేరాలని పిలుపునిచ్చారు. ప్రపంచమే మాదిగల వైపు చూసే విధంగా.. 'మన డప్పు.. మన ఆట, మన పాట, మన సంస్కృతిని ప్రపంచానికి తెలిసే విధంగా ఈ ప్రదర్శన ఉండాలన్నారు. ప్రదర్శన ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కనువిప్పు కలిగే విధంగా మాదిగల డప్పులు మారుమోగాలన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు కోసం వేల గొంతుల నినాదం ఏకమవ్వాలన్నారు. అప్పుడే రేవంత్ రెడ్డి సర్కార్ దిగివచ్చి ఎస్సీ ఏబిసిడి వర్గీకరణ సానుకూలంగా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షులు,వీరయ్య మాదిగ, చిలిపిచేడ్ మండల ఇంచార్జ్ దుర్గ దాస్ మాదిగ, ఎల్లయ్య మాదిగ, నవీన్ మాదిగ, కృష్ణ, నాగేష్, శంకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
మెదక్
ఆదివారం | 02 ఫిబ్రవరి 2025 | www.navatelangana.com

ఘనంగా మార్కండేయ మహర్షి జయంతి వేడుకలు



నవతెలంగాణ-కౌడిపల్లి

మండల కేంద్రమైన కౌడిపల్లిలో శనివారం మార్కండేయ మహర్షి జయంతిని పురస్కరించుకొని కౌడిపల్లి పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం పద్మశాలి సంఘం స్థలం షెడ్ వద్ద పతాకావిష్కరణ చేసి మార్కండేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు పిసికే నర్సింలు జిల్లా యువత ఉపాధ్యక్షుడు సంభారపు తిరుమలేష్, డాక్టర్ పురుషోత్తం, పద్మ దుర్గయ్య, పోల ప్రభాకర్, సగ్గెం భీమేష్ , మంత్రి కృష్ణ, వెంకటయ్య, నర్సింలు, శ్రీనివాస్, పోల పురుషోత్తం, పోల నవీన్, శ్రీనివాస్, పి శ్రీనివాస్, పి శ్రీను, ఆర్ఎంపీ వైద్యులు శ్రీను, రవి, కృష్ణ తోపాటు పోల లక్ష్మణ్, పద్మ సత్యనారాయణ, తిరుపతి, నరేందర్, మంత్రి గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయం

- కాంగ్రెస్ జిల్లా నాయకులు నవీన్ గుప్తా



నవతెలంగాణ-నర్సాపూర్

కాంగ్రెస్ నియోజకవర్గ పార్టీ ఆధ్వర్యంలో సీఎం కప్ పేరిట ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని, కాంగ్రెస్ జిల్లా నాయకులు నవీన్ గుప్తా అన్నారు .శనివారం నర్సాపూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ఏడవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా శనివారం రామ్ చంద్రపూర్ సుల్తాన్ లెవెన్ జట్ల మధ్య పోటీ జరగగా ముందుగా టాస్ వేసి నవీన్ గుప్తా క్రికెట్ ను ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, క్రీడాకారులు ఉన్నారు.

అట్టహాసంగా ప్రారంభమైన మల్లన్న జాతర



నవతెలంగాణ-శివ్వంపేట

మండలంలోని పిల్లుట్ల గ్రామంలో నాలుగు రోజుల పాటు బ్రహ్మాండంగా నిర్వహించే మల్లన్న జాతర ఉత్సవాలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. యాదవ సంఘం ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గంగ స్నానం నిర్వహించారు. యాదవ సంఘం పెద్ద గొల్ల ఇంటి నుండి యాదవులు గంపలను ఊరేగింపుగా గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఒగ్గు కళాకారులు విన్యాసాల మధ్య చెరువులోకి తీసుకెళ్లి అక్కడ స్వామివారి పటంతో మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

సిద్దయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-హవేలీ ఘనపూర్

అనారోగ్యంతో మృతి చెందిన మండల పరిధిలోని బూరుగుపల్లి గ్రామానికి చెందిన జోగన్న గారి సిద్దయ్య మృతి చెందడంతో బి.ఆర్.ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కాంటారెడ్డి తిరుపతిరెడ్డి ఆ కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. శనివారం మండల పరిధిలోని బూరుపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రవీందర్ గౌడ్, ఆ కుటుంబానికి రూ.5000 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు టీ బాలరాజ్, టి వెంకటేష్ రజక సంఘం సభ్యులు భూమయ్య, లక్ష్మయ్య, రాజు కృష్ణ, నర్సింలు, విజయ్, దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టియు క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ఉన్నత పాఠశాలలో ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు రాజగోపాల్ గౌడ్ , ప్రధాన కార్యదర్శి కర్రె పోచయ్యల ఆధ్వర్యంలో ఎస్‌టియు క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ టి యు మండలశాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.శ్రీకాంత్, కే. సంపత్, మండల, జిల్లా బాధ్యులు పరమేశ్వర్, మహేష్,నగేష్, వినయ్, భాస్కర్, శ్రీనివాస్, రాజేందర్, నరేష్, శివకుమార్, శివప్రసాద్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ విజయవంతం చేయాలి

- కాంగ్రెస్ గౌడ జన హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు చంద్రం కృష్ణ గౌడ్



నవతెలంగాణ-కౌడిపల్లి

గౌడ జన హక్కుల పోరాట సమితి క్యాలెండర్ ఆవిష్కరణకు జిల్లాలో ఉన్న గౌడ కులాస్తులు అందరు రాగలరని గౌడ జనా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు చంద్రం కృష్ణ గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం నాడు అయిన విలేకరులతో మాట్లాడుతూ గౌడ జన హక్కుల పోరాట సమితి క్యాలెండర్ ఆవిష్కరణ ఆదివారం కౌడిపల్లి శ్రీ రేణుక ఎల్లమ్మ టెంపుల్ వద్ద ఉదయం ఉంటుందని ఆయన అన్నారు ఈ కార్యక్రమానికి గౌడ కులాస్తులు అందరు రాగలరని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు విజయ్ కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి చంద్ర దుర్గా గౌడ్, హాజరవుతున్నట్టు ఆయన తెలిపారు.

దివ్యాంగుల కోసం దరఖాస్తు గడువు 12వ తేది వరకు పొడిగింపు

- ఐసిడిఎస్ పిడి హైమావతి

నవతెలంగాణ-మెదక్

దివ్యాంగులు వ్యక్తిగత స్వయం ఉపాధి రుణాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా ప్రభుత్వం ఈ నెల 12వ తేది వరకు గడువు పొడిగించడం జరిగిందని ఐసిడిఎస్ పీడీ .హైమావతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక్క యూనిట్‌కు రూ. 50 వేల చొప్పున ప్రభుత్వం అందజేస్తుందన్నారు. మొత్తం మెదక్ జిల్లాలో 25 యూనిట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ధ్రువీకరణ పత్రాలను ఆన్లైన్లో సమర్పించాల్సి ఉంటుందన్నారు. జిల్లాలోని వివిధ మండలాల ఎంపీడీవోలను దివ్యాంగులు సంప్రదించాలని కోరారు. అవకాశం జిల్లాలను దివ్యాంగులు అందరూ వినియోగించుకోవాలని తెలిపారు. గతంలో లబ్ధి పొందిన వారికి అవకాశం ఉండదని ఆమె స్పష్టం చేశారు.

పెద్దమ్మ గుడి వద్ద ప్రేమ పెళ్లి

నవతెలంగాణ-రామాయంపేట



రామాయంపేట పట్టణంలోని పెద్దమ్మ గుడి వద్ద ప్రేమ వివాహం జరిగింది. ఇరు కుటుంబాల కథనం ప్రకారం చేగుంట మండలం ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన మామిడాల వినయ్, రామయంపేట పట్టణానికి చెందిన మర్రికింది రేవతి గత రెండు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో రేవతి గర్భం దాల్చింది. అప్పటి నుంచి వినయ్ నుంచి సరైన స్పందన లేకపోవడంతో, శనివారం రేవతి రామాయంపేట పోలీసులను ఆశ్రయించారు. ఇరు కుటుంబాల సభ్యులను పిలిచి రామాయంపేట ఎస్సై బాలరాజు కౌన్సిలింగ్ చేశారు. ఇరు కుటుంబాల ఒప్పందం మేరకు రామాయంపేట పట్టణంలోని పెద్దమ్మ దేవాలయం వద్ద శనివారం వివాహం జరిపించారు.

చల్మెడ నుంచి అంతర్ జిల్లాలకు బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలి

- ఎన్నో సంవత్సరాల నుంచి మొరపెట్టుకున్నా పట్టించుకోని అధికారులు
- పట్టించుకోవాలని మండల ప్రజల వేడుకోలు





నవతెలంగాణ-నిజాంపేట

గ్రామాలు మండలాలు అభివృద్ధి చెందాలంటే రోడ్డు రవాణా సౌకర్యాలు ఉంటేనే మండలాలు అభివృద్ధి చెందుతాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మండల కేంద్రానికి రోడ్డు సౌకర్యాలు కల్పిస్తున్నామని అధికారులు చెప్తున్నారు కానీ మెదక్ జిల్లా నిజాంపేట మండల కేంద్రం నుంచి అంతర్ జిల్లాలకు వెళ్లాలంటే రోడ్డు సౌకర్యాలు సరిగ్గా లేవని మండల ప్రజలు వాపోతున్నారు. సిద్దిపేట, కామారెడ్డి జిల్లాలకు నిజాంపేట మండలం సరిహద్దులలో ఉన్నది. చల్మెడ గ్రామం నుంచి కామారెడ్డి జిల్లా పెద్ద మల్లారెడ్డికి రోడ్డు రవాణా సౌకర్యం లేక పోవడం, కంచర్లకు వెళ్లాలంటే కూడా రోడ్డు సౌకర్యం లేక గ్రామస్తులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి అధికారులకు మొరపెట్టుకున్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. చల్మెడ నుంచి పెద్ద మల్లారెడ్డికి దాదాపు 8 కిలోమీటర్ల వరకు ఉంటుందని, బీటీ రోడ్డు చేసినట్లయితే దూరం తగ్గి వ్యాపార పరంగా నిజాంపేట మండల కేంద్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే చల్మెడ నుంచి పెద్ద మల్లారెడ్డికి బీటీ రోడ్డు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బీటీ రోడ్డు మంజూరు చేయాలి

చల్మెడ నుంచి పెద్దమల్లారెడ్డి గ్రామం వరకు బీటీ రోడ్డు మంజూరు చేయాలని, ఎన్నో సంవత్సరాల నుంచి అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. చల్మెడకు పెద్ద మల్లారెడ్డికి రోడ్డు సౌకర్యం కల్పించినట్లయితే వ్యాపారపరంగా మండల కేంద్రం అభివృద్ధి చెందుతుందని వ్యవసాయదారులకు కూడా రోడ్డు ఎంతో ఉపయోగపడుతుంది. నిత్యం వందలకొద్ది వాహనాదారులు ఈ రోడ్డు వెంబడి ప్రయాణం చేస్తూ, అనేక ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే బీటీ రోడ్డు వేయాలి.



దొంతర బోయిన మధు, చల్మెడ నివాసి

చల్మెడ నుంచి కంచర్ల వరకు బీటీ రోడ్డు వేయాలి

చల్మెడ గ్రామం నుంచి కంచర్ల వరకు బిటి రోడ్డు వేసినట్లయితే కంచర్ల నుండి పెద్ద మల్లారెడ్డికి ప్రయాణ సౌకర్యం సులభతరంగా ఉంటుంది. నిజాంపేట మండల కేంద్రం కూడా అభివృద్ధి చెందుతుంది. ప్రభుత్వం వెంటనే స్పందించి చల్మెడ గ్రామం నుంచి బీటీ రోడ్లను మంజూరు చేయాలి.



శ్రీనివాస్, చల్మెడ నివాసి

3 నుంచి తిరుమల స్వామి బ్రహ్మోత్సవాలు!

- చారిత్రాత్మక చరిత్ర గల దేవాలయం.
- కోరిన కోరికలు తీర్చే వెంకటేశ్వర స్వామి..!



నవతెలంగాణ-నిజాంపేట

కాకతీయ కాలం నాటి చరిత్ర కలిగిన దేవాలయం మెదక్ జిల్లా నిజాంపేట మండలం చల్మెడ గ్రామంలో గల తిరుమల బండ పై ఉంది. ఈ దేవాలయ చరిత్ర స్థానికుల మేరకు. కాకతీయుల కాలం క్రీ.శ 8 వ శతాబ్దంలో కాకతీయ మహారాజు యుద్ధానికి వేరొక రాజ్యానికి వెళ్తున్న క్రమంలో సాయంకాలం అవడంతో తిరుమల బండను చూసి తమ సైనికులతో తిరుమల బండపై స్వేద తీరీ ఉదయం వెళ్దామని నిర్ణయించుకుంటారు. నిద్రలో ఉన్న రాజు కలలో శ్రీ వెంకటేశ్వర స్వామి కనిపించి తాను ఆ బండపై స్వయంభుగా వెలిసానని తనకు ఆ బండపై గుడిని కట్టించుమని ఆజ్ఞాపిస్తాడు. దీంతో రాజు ఆ తిరుమల బండపై వెంకటేశ్వర స్వామి గుడిని నిర్మించినట్లు చరిత్ర ఉంది. అందుకే ఈ గుడికి తిరుమల స్వామి బండ అని పేరు కూడా ఉందని స్థానికులు చెబుతున్నారు.

ఉత్తర ద్వారంలో దర్శన భాగ్యం

తెలంగాణ రాష్ట్రంలోనే ఎక్కడలేని విధంగా ఈ గుడిలో అత్యంత ప్రాముఖ్యతమైన ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శన భాగ్యం ఉంటుంది. వెంకటేశ్వర స్వామి దర్శనం ఎక్కడ కూడా ఉత్తరభాగాన దర్శనం ఇవ్వడం జరగదనీ, ఈ గుడిలో ఆ దర్శన భాగ్యం ఉంటుంది.

ఇతర జిల్లాల నుంచి ప్రజలు

ఈ గుడి వద్ద మాఘ అమావాస్య మాసంలో శ్రీ తిరుమల స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం జరుగుతుంది. ఈ బ్రహ్మోత్సవాలు మూడు రోజులపాటు అంగరంగ వైభవంగా వేద పండితుల మధ్య నిర్వహిస్తారు. స్వామివారి పల్లకి సేవ, యజ్ఞహోమం, స్వామివారి కళ్యాణ మహోత్సవం, రథం తిరుగుట, ఎడ్ల బండ్ల ఊరేగింపు లాంటి కార్యక్రమాలు మూడు రోజులపాటు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాలు చూడడానికి భక్తులు అధిక సంఖ్యలో ఇతర జిల్లాల నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలలో పాల్గొంటారు.

దాతల సహకారంతో భోజనాలు

దాతలు సహకారంతో ప్రతి ఏటా ఈ దేవాలయం వద్ద బ్రహ్మోత్సవాల సమయంలో అన్నదాన కార్యక్రమలు నిర్వహిస్తారు. ఈ అన్నదాన కార్యక్రమంలో కొన్ని వేలల్లో భక్తులు భోజనంలో పాల్గొంటారు.

కోరికలు తీర్చే.. కొంగు బంగారంగా వెంకటేశ్వర స్వామి

చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ గుడి వద్ద కు కోరికలను తీరాలని మొక్కులు మొక్కుకుంటారు. కోరిన మొక్కులు తీర్చే కొంగుబంగారంగా శ్రీ వెంకటేశ్వర స్వామి విలసిల్లుతుండని ఇక్కడి ప్రజల ప్రగాఢ నమ్మకం.



గుడి పక్క భాగంలో గుండం

ఈ గుడి పక్క భాగంలో ఉన్న గుండం లో భక్తులు స్నానాలు ఆచరించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. చారిత్రాత్మక దేవాలయ అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి ఆలయ అభివృద్ధి కోసం కృషి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. .

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం..

స్వామి వారి బ్రహ్మోత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తాం. గుడి చుట్టూ ఎడ్లబండ్లను తింపడం జరుగుతుంది. ఇక్కడ భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగు జాగ్రత్తలు చేపట్టామనీ. ఆలయ భూములు దాదాపు 282 ఎకరాల వరకు ఉంటది. జాతర నిర్వహించడానికి విశాలమైన స్థలం ఉన్నది మూడు రోజులపాటు ఈ జాతర ఘనంగా నిర్వహిస్తున్నాము.



అక్కపల్లి.రాం రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్

విద్యార్థినిలకు భరోసా ఇస్తున్న షీటీం

- జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి



నవతెలంగాణ- మెదక్

మెదక్ జిల్లాలో షీటీమ్స్‌తో మహిళలకు, బాలికలకు, విద్యార్థినిలకు, భరోసా ఇస్తుందని మెదక్ జిల్లా ఎస్పీ విజయ్ కుమార్ రెడ్డి తెలిపారు. జిల్లాలోని షీ టీమ్స్ బృందాలు ప్రభుత్వ కళాశాలలో, ప్రభుత్వ పాఠశాలల్లో, తెలంగాణ మోడల్ స్కూళ్లలో, రెసిడెన్షియల్ స్కూల్ లలో కేజీబీవీ స్కూళ్లలో విద్యార్థిని విద్యార్థులకు ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో షీ టీమ్స్ హ్యూమెన్ ట్రాఫికింగ్, డ్రగ్స్ మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఆపద సమయాల్లో మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, మహిళల వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు అంతే కాకుండా మహిళలు అత్యవసర పరిస్థితుల్లో డయల్-100 కు కాల్ చేసి తక్షణ పోలీస్ సహాయం పొందాలని సూచించారు. షీటీమ్ వాట్సప్ నెంబర్ 8712657963, 6303923823 పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712657888 లకు ఫోన్ చేసి తక్షణ సహాయం పొందాలన్నారు. ఫిర్యాదు అందిన వెంటనే ఆ ప్రదేశానికి చేరుకుని సహాయక చర్యలు చేపడతామన్నారు.

మంచినీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు

- ఏఈ బిక్షపతి



నవతెలంగాణ-నిజాంపేట

తెలంగాణరాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నామని మిషన్ భగీరథ ఏఈ బిక్షపతి అన్నారు. మండల పరిధిలోని బచ్చు రాజు పల్లి గ్రామంలో స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రాంలో భాగంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో మంచినీటి గురించి సమస్యలు తలెత్తకుండా చూడాలని గ్రామపంచాయతీ సెక్రటరీ రాములుకు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఫిబ్రవరి ఒకటో తేది నుంచి 13వ తేది వరకు ఈ కార్యక్రమాన్ని నిజాంపేట్ మండలంలో చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా బచ్చు రాజు పల్లి గ్రామపంచాయతీలో గ్రిడ్డు వాటర్ మెన్, ఇంట్రా వాటర్ మెన్, మిషన్ భగీరథ హెల్పర్ అందరూ కలిసి గ్రామాన్ని సందర్శించి ముందు జాగ్రత్తగా మంచినీటి సరఫరాలో ఎటువంటి లోపాలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా సూచనలు చేశామన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం త్రాగునీటి ఇబ్బంది కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాలలోని ప్రజలు కూడా నీటిని వృధా చేయద్దని సరిపడ నీరు వచ్చిన తర్వాత నల్లాలను బందు చేయాలన్నారు.

శ్రీగురుపీఠంలో శివకుమార్ గౌడ్ ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-శివ్వంపేట

మండలంలోని గూడూరు గ్రామంలో స్వర్గీయ జిన్నారం పెద్దగోని లింగయ్య గౌడ్, అంజమ్మ స్మారకార్థం శ్రీ గురుపీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, హైకోర్టు న్యాయవాది జిన్నారం పెద్దగోని శివకుమార్ గౌడ్, రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మితమవుతున్న శ్రీ గురుపీఠంలో శ్రీ దత్త భగవానునికి శ్రీ గురుపీఠం చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ జిన్నారం పెద్దగోని శివకుమార్ గౌడ్ శనివారం శ్రీ గురుపూజ, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, షిరిడీ సాయినాథునికి మధ్యాహ్నం హారతి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కూడ భక్తిభావం కలిగి ఉండి, ఆధ్యాత్మికతో పరుల సేవలో ముందుండాలన్నారు. శ్రీ గురు పీఠంలో ప్రత్యేక పూజలలో ట్రస్ట్ సభ్యులు జిన్నారం పెద్దగోని సూర్యంకుమార్ గౌడ్, నోముల హన్మంతు గుప్త, కొంతాన్ పల్లి సత్యనారాయణ గౌడ్, వంజరి కొండల్, బల్యంపేట భాస్కర్, విశ్వశ్రీలా ఛాంబర్స్ సీఏఓ లిఖిత, రాజేందర్ రెడ్డి, బ్రహ్మాచారి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగం



నవతెలంగాణ -వెల్దుర్తి

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగపడుతుందని బీఆర్ యస్ పార్టీ మాజీ ఎంపీటీసీ మోహన్ రెడ్డి మాజీ మార్కెటింగ్ శాఖ వైస్ చైర్మన్ కోదండ కృష్ణ గౌడ్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన వెంకటేశ్వర్లు అనారోగ్యంతో హైదరాబాదులో చికిత్స పొందుతూ నడవలేని స్థితిలో ఉన్న అతని ఇంటికి శనివారం వెళ్లి రూ.60 వేల విలువగల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బి ఆర్ఎస్ నాయకులతో కలిసి బాధితునికి అంద చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు ఆపదలో ఉన్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జగ్గ అశోక్ గౌడ్, తోట నరసింహులు, చినింగి కృష్ణయ్య, సాకారం శ్రీనివాస్ గౌడ్, ఎస్ శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

ప్రసాద్ ట్రస్టు ద్వారా నిస్వార్థంగా సేవలందిస్తున్నాం

- ప్రసాద్ ట్రస్ట్ చైర్మన్ శివకుమార్ గౌడ్



నవతెలంగాణ-శివ్వంపేట

గ్రామాలలోని నిరుపేదలకు, నిర్భాగ్యులకు ప్రసాద్ ట్రస్టు ద్వారా నిరంతరంగా, నిస్వార్థంతో సేవలందిస్తున్నామని ప్రసాద్ ట్రస్టు చారిటబుల్ ట్రస్టు చైర్మన్, హైకోర్టు న్యాయవాది జిన్నారం పెద్దగోని శివకుమార్ గౌడ్ అన్నారు. శివ్వంపేటకు చెందిన ముద్దగల్ల రాజు భార్యకు కుట్టు మిషన్, టిఫిన్ సెంటర్ నిర్వాహకులు వంజరి కొండల్‌కు ఎలక్ట్రానిక్ ఫ్రిజ్‌ను గూడూరులోని శ్రీ గురుపీఠంలో శనివారం అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ పేద ప్రజలకు ఎన్నో ఏండ్లుగా ప్రసాద్ ట్రస్ట్ ద్వారా మండలంలోని పాఠశాలలలో వసతుల కల్పన, గ్రామాలలో మంచినీటి సమస్య పరిష్కారానికి, పచ్చదనం పెంపొందించేందుకు మొక్కలు నాటడం వాటిని సంరక్షించడానికి కృషి చేస్తున్నామన్నారు. పేద ప్రజలకు సహకారం, మహిళలకు కుట్టు మిషన్‌లు అందించడం, ఉన్నత విద్యాభ్యాసం కోసం ఎంతో మంది విద్యార్థులకు సహాయం అందించామన్నారు. ప్రసాద్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వీరామంగా చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్ ట్రస్టు సభ్యులు పెద్దగోని సూర్యకుమార్ గౌడ్, నోముల హనుమంతు గుప్త, కొంతాన్ పల్లి సత్యనారాయణ గౌడ్, వడ్ల బ్రహ్మచారి, బల్యంపేట భాస్కర్, విశ్వశ్రీ లా ఛాంబర్స్ లిఖిత, రాజేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శబాష్ పల్లిలో వెంకట్రాంరెడ్డి ఆర్థిక సహాయం

- నాలుగు కుటుంబాలకు సహకారం



నవతెలంగాణ-శివ్వంపేట

నిరంతరంగా మండలంలో ప్రతి నిత్యం ఆపదలో ఉండే బాధిత కుటుంబాలకు ఆర్థిక సహకారం అందించే దాత, శివ్వంపేట పీఏసీఎస్ చైర్మన్, కొంతాన్ పల్లికి చెందిన చింతల వెంకట్రాంరెడ్డి శనివారం మండలంలోని శబాష్‌పల్లి గ్రామంలో 4 బాధిత కుటుంబాలకు తన స్వంతంగా ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామానికి చెందిన జోడు వెంకటేష్, రంగపల్లి నారాయణ, షేక్ షాదుల్ నాయనమ్మ ముగ్గురు ఇటీవలే మరణించగా పార్టీ వర్గాల ద్వారా విషయం తెలుసుకుని బాధిత కుటుంబాలను పరామర్శించిన చైర్మన్ వెంకట్రాంరెడ్డి తనవంతు సహాయంగా ఒక్కో కుటుంబానికి రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. ఇదే గ్రామానికి చెందిన మస్కురి సాయిలు పక్షవాతంతో అనారోగ్యం బారిన విషయం తెలుసుకుని ఆయన ఆసుపత్రి మందుల ఖర్చుల కోసం రూ.5 వేల ఆర్థిక సహకారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ తనకు సంపాదన ముఖ్యం కాదని, బాధితులను ఆదుకోవడమే తన లక్ష్యమన్నారు. గ్రామంలో బాధిత కుటుంబాలకు సహకారం అందించిన వెంకట్రాంరెడ్డికి కాంగ్రెస్ పార్టీ నాయకులు అయ్యగారి యాదగిరి, జోడు సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు జోడు సత్యనారాయణ, అయ్యగారి యాదగిరి, ప్రశాంత్, కోదాస్ ప్రవీణ్, నర్సిములు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఘన స్వాగతం పలికిన ఎస్పీ


- ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి



నవతెలంగాణ-మెదక్

పథకాలు సాధించిన క్రీడాకారులకు జిల్లా ఎస్పి కార్యాలయంలో ఘనంగా సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగిన మూడవ తెలంగాణ రాష్ట్ర పోలీస్ క్రీడల్లో మెదక్ జిల్లా పోలీసులు రికార్డు సృష్టించారు. ఈ క్రీడలో మెదక్ జిల్లా పోలీసులు ఏకంగా 8 పతకాలను సాధించారు. ఇందులో 1 బంగారు పతకంతో పాటు 2 రజితలు , 5 కాంస్య పతకాలను గెలుచుకున్నారు. కానిస్టేబుల్ శ్రీ రాజాశేకర్ టేబల్ టెన్నిస్ డబుల్స్ లో బంగారు పథకం మరియు సింగిల్స్ లో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. మెదక్ డిఎస్పి ప్రసన్న కుమార్ విభాగంలో ఒక రజిత పథకం ఒక కాంస్య పథకం గెలుపొందారు, కానిస్టేబుల్ లాంగ్ టెన్నిస్ డబుల్స్ విభాగంలో రజిత పథకం సింగిల్స్ విభాగంలో కాంస్య పథకం గెలుపొందారు అదేవిధంగా రెజ్లింగ్ 70 కేజిల విభాగం లో కాంస్య పథకాన్ని సాధించారు, కానిస్టేబుల్ సంగ్రామ్ రెజ్లింగ్ 72 కేజిల విభాగంలో కాంస్య పథకాన్ని గెలుపొందారు. ఈదేవిదంగా జాతీయ స్థాయి పోటీలో కూడా మంచి ప్రతిభను కనభరిచి తెలంగాణ పోలీస్ డిపార్ట్మెంట్ పేరును మారు మ్రోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మదనపు ఎస్పీ మహేందర్ జిల్లా సాయుద దళ డి.ఎస్.పి రంగనాయక్ ఎస్బీ ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి ఆర్ఐ శైలేందర్, ఆర్ఎస్ఐ నరేష్ క్రీడాకారులు సిబ్బంది పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ ప్రారంభం



నవతెలంగాణ-పాపన్నపేట: మండల కేంద్రమైన పాపన్నపేట ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ప్రత్యేక తరగతుల నిర్వహణ లో భాగంగా శనివారం స్నాక్స్ పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. పదో తరగతి చదివి విద్యార్థులకు గత కొంతకాలంగా ఉదయం సాయంత్రం పూట ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే, కాగా ఫిబ్రవరి 1 నుంచి మార్చి 20 వరకు విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్ పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా మొదటి రోజు విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్న ఉద్దేశంతో బెల్లం పట్టీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ హెడ్మాస్టర్ ప్రవీణ్, ఉపాధ్యాయులు యాదయ్య, వేణుగోపాల్ రెడ్డి, నాగరాజు, సిఆర్పి సత్యనారాయణ రెడ్డి, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు ఎస్సీ హాస్టల్‌ను తిరిగి ప్రారంభించాలి

-ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆముదాల రంజిత్ రెడ్డి



నవతెలంగాణ-మద్దూరు

మద్దూరు మండల కేంద్రంలో ఉన్న ఎస్సీ హాస్టల్‌ను తిరిగి ప్రారంభించాలని సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఆముదాల రంజిత్ రెడ్డి, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మద్దూరులో ఉన్న ఎస్సీ హాస్టల్ ఎదుట శనివారం నిరసన కార్యక్రమం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత కాలంలో మద్దూరులో ఉన్న ఎస్సీ హాస్టల్ గతంలో 90 మందితో నడిచిన హాస్టల్ ఇప్పుడు తాళంతో ఉంటుందనిఅన్నారు. సిద్దిపేట జిల్లా ఎస్సీ డీడీ అధికారులు హాస్టల్‌ని సందర్శన చేసి విద్యార్థులతో హాస్టల్‌ను మళ్లీ ప్రారంభించాలని కోరారు. గతంలో జరిగిన పొరపాట్లు పరిశీలించి మంచి వార్డెన్ ని కేటాయించి గ్రామాలు తిరిగి విద్యార్థులను హాస్టల్‌లో తీసుకువచ్చేటట్టుగా పని చేయాలని ఆయన కోరారు. తక్షణమే ఎస్ సీడీడీ అధికారులు స్పందించి హాస్టల్ తిరిగి ప్రారంభించే విధంగా వారు చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చేర్యాల డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు మైసమ్మ తల్లి రాహుల్, తాడూరి భరత్ కుమార్ రాకేష్ అరవింద్, భరత్ చిన్న సాయి విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సొంత భవనం లేకపోతే విద్యార్థులకు నష్టం



నవతెలంగాణ-దుబ్బాక

తమ విద్యార్థులు నష్టపోకుండా ఉండాలంటే.. సొంత భవనాన్ని కేటాయించాలని ఎంపీపీఎస్ నెంబర్ 2 పాఠశాల హెచ్ఎం సురేష్ కోరారు. దుబ్బాకలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఎంపీపీఎస్-2 స్కూల్ వద్ద అద్దె బ్లాక్‌లో ఉంటున్న కొంతమంది పాఠశాల ప్రాంగణాన్ని తరచుగా చెత్తాచెదారంతో దుర్గంధభరితంగా చేస్తున్నారని, వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం దుబ్బాక లోని మండల వనరుల కేంద్రంలో కార్యాలయ సిబ్బంది శ్రీధర్, గణేష్‌లకు వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో నెలకొన్న నీరు, డ్రైనేజీ సమస్యనూ పరిష్కరించాలని, అలాగే సొంత భవనాన్ని మంజూరు చేయాలని పాఠశాల హెచ్ఎం సురేష్ ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయులు చంద్రశేఖర్, విద్యార్థుల తల్లిదండ్రులు అమీర్ ఖాన్, శ్రీనివాస్, రషీద్, పలువురున్నారు.

యువజన కాంగ్రెస్ అధ్యక్షున్ని కలిసిన సాదుల



నవతెలంగాణ-నంగునూరు

రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జెక్కిడి శివను సిద్దిపేట జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సాదుల పవన్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పూజల గోపికృష్ణ. అసెంబ్లీ ప్రెసిడెంట్ వాహబ్, సాదుల సాయి ప్రతాప్, బబ్బు, తదితరులు పాల్గొన్నారు.

ఇందూరులో క్రికెట్ ప్రీమియర్ లీగ్ ప్రారంభం

నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్



హిందూ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యంలో ఐపీఎల్ ఇంటర్ లెవెల్ క్రికెట్ టోర్నమెంట్ మ్యాచులు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వీపీ రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన టాస్ వేసి ఐపీఎల్ మ్యాచ్లు ప్రారంభించారు. ఈ ఐపిఎల్ మ్యాచ్లలో 10 టీమ్‌ల విద్యార్థులు పాల్గొననున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 4 వరకు మ్యాచ్లు జరుగుతాయని తెలిపారు. మ్యాచ్లలో గెలుపొందిన వారికి అవార్డులు అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల పీఆర్ఓ బొడ్డు రఘు, ఫిజికల్ డైరెక్టర్ సంతోష్, ఎండి సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయంలో ప్రధాన న్యాయమూర్తి ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-నంగునూరు



మండలంలోని కోనాయిపల్లి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల్లో భాగంగా ఆమె స్వామి వారికి కానుకలను సమర్పించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు ఆమెకు తీర్థ ప్రసాదాలను అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కోర్టు సిబ్బంది కరుణశ్రీ, శ్రీనివాస్, ఎల్లయ్య, కిరణ్, రాజ గోపాల్ పేట ఎస్సై ఆసీఫ్, నాయకులు దువ్వల మల్లయ్య తదితరులు హాజరైనారు.

ఎంఆర్ఓకు శుభాకాంక్షలు తెలిపిన మాజీ వైస్ ఎంపీపీ

నవతెలంగాణ -ములుగు



ములుగు మండల నూతన తహసీల్దార్‌గా నియమితులైన ఆరిఫాను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన ములుగు మండల మాజీ వైస్ ఎంపీపీ దేవేందర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు ఏకంబర్ రెడ్డి, విజయ్ రెడ్డి పాల్గొన్నారు.

చేబర్తి పెద్ద చెరువుకు ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-మర్కుక్



మండల పరిధిలోని కూడవెల్లి వాగు జన్మస్థానం చేబర్తి పెద్ద చెరువు వద్ద గ్రామస్థులు శనివారం కుకూనూరు పల్లి తహసీల్దారు సుజాత కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాఘమాసంలో భాగంగా కూడవెల్లి వాగు జన్మస్థానమైన చేబర్తి చెరువును దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చేబర్తి మాజీ ఉపసర్పంచ్ గుర్రాల స్వామి ,గ్రామస్థులు టప్ప రాజు,గంధమల్ల తిరుపతి తదితరులున్నారు.

రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపుతో ఊరట

నవతెలంగాణ-సిద్ధిపేట



ఆదాయం పన్ను రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు ఇవ్వడం మధ్యతరగతి, ఉపాధ్యాయు, ఉద్యోగులకు చాలా ఊరట నిచ్చే అంశమని ఎస్‌టీయూ సిద్ధిపేట జిల్లా అధ్యక్షులు భూపాల్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ చాలా సంవత్సరాల నుంచి ఎదురుచూస్తున్న సందర్భంలో ఈసారి ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీలు పేదల పక్షాన నిలిచారన్నారు. ఎస్టీయూ సిద్ధిపేట జిల్లా శాఖ పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

హనుమాన్ దేవాలయానికి రూ.లక్ష విరాళం

-అందించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



నవతెలంగాణ-నంగునూరు

మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ దేవాలయంకు శనివారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు రూ.1 లక్షను విరాళంగా అందజేశారు. వచ్చే నెలలో ఆ దేవాలయ ప్రతిష్టా కార్యక్రమం ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. మీ వంతు సహాయం కావాలని ఇటీవల గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు కలిసారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా చేయాలని సూచించారు. గ్రామస్తులు, ఆలయ నిర్వహకులు హరీశ్‌రావు కు కృతజ్ఞతలు తెలియజేశారు.

మృతుల కుటుంబాన్ని పరామర్శించిన హరీశ్ రావు

నవతెలంగాణ-సిద్ధిపేట



పట్టణానికి చెందిన మాజీ వార్డ్ సభ్యులు, పార్టీ నాయకులు కనకయ్య - తార దంపతులు ఇటీవల పెద్దపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా వారి కుటుంబాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పరామర్శించారు. శోక సంద్రంలో ఉన్న కుటుంబాన్ని ఓదార్చారు. అధైర్య పడొద్దని, ధైర్యంగా ఉండాలని కుటుంబానికి మనోధైర్యాన్ని ఇచ్చారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు.

కాంగ్రెసులో టిక్ టిక్ లేదు..టంగ్ టంగ్ లేదు

- కాళేశ్వరం సజీవ సాక్ష్యం కేసీఆర్ ప్రభుత్వం
- బండచెర్ల పల్లి గ్రామస్తులతో హరీశ్‌రావు ముచ్చట్లు
- కేసీఆర్ ప్రభుత్వంలో పుల్లూరు బండ అభివృద్ధి





నవతెలంగాణ-సిద్ధిపేటరూరల్

కేసీఆర్ ప్రభుత్వంలో రైతులకు రైతు బంధు పంట కాలం ముందే పెట్టుబడి సాయం టిక్ టిక్ మనీ ఫోన్‌కు మెసేజ్ వచ్చేదని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత టిక్కు టిక్కు లేదు.. టంగు టంగు లేదు అంటూ మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శనివారం సిద్ధిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామ పర్యటనలో భాగంగా గ్రామం వద్ద ఉన్న రంగనాయక సాగర్ ఎడమ కాలువలో పరవళ్ళు తొక్కుతున్న గోదావరి జలాలను చూసి ఆనందం వ్యక్తం చేస్తూ నాయకుల తో సెల్ఫీ దిగారు. ముందుగా బండ చర్లపల్లి రైతులు గ్రామస్తులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో వానాకాలం వచ్చిందంటే రైతులకు అన్ని రకాల విత్తనాలు మందులు పెట్టుబడి సాయం అన్ని అందుబాటులో కేసీఆర్ ఉంచాడని, కాంగ్రెస్ పాలనలో వానాకాలం రైతు బంధు ఎగ్గొట్టిండు. కేసీఆర్ ఉన్నప్పుడు మంచిగా స్టెప్ బై స్టెప్ అందరికీ వస్తుండే, ఇప్పుడు ఎవరికీ వస్తలేదు. కొత్తగా ఆత్మీయ భరోసా అంటుండు రెండు గుంటలు ఉన్న రైతు భరోసా రాలేదు ఏది వచ్చేట్టు లేదు. ఇప్పుడు ఎలక్షన్ కోడ్ వస్తుంది. ఏది ఇచ్చుడు లేదు సర్పంచ్ ఎలక్షన్ల కోసం ఇస్తా ఇస్తా అంటుండు అన్నీ ఎగ్గొడ్తుండు. అసెంబ్లీ వస్తుంది. నిలదీస్తాం అన్ని వచ్చేటట్టు చేస్తా అని రైతులకు హరీశ్‌రావు భరోసా ఇచ్చారు. వీరి వెంట మాజీ ఎంపీపీ బీఆర్ఎస్ మండల అధ్యక్షులు ఎర్ర యాదయ్య, మాజీ సర్పంచ్ వీణ దశరథం, నాయకులు రామచంద్ర రావు, తిరుపతి పాల్గొన్నారు.

కేసీఆర్ ప్రభుత్వంలో పుల్లూరు బండ అభివృద్ధి

కేసీఆర్ ప్రభుత్వం పుల్లూరు బండ అభివృద్ధి జరిగిందని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శనివారంసిద్ధిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామంలో జరుగుతున్న బండ జాతర చివరి రోజు ఉత్సవాల్లో ఆయన పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి సుదర్శన నరసింహ మహా పూర్ణహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పుల్లూరు బండ జాతర ఘనంగా జరిగింది. కేసీఆర్ హయాంలో పుల్లూరు బండ అభివృద్ధికి రూ.కోట్ల తో మౌలిక వసతులు కల్పించి ప్రజలకు ఇబ్బంది లేకుండా అభివృద్ధి జరిగిందన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత అభివృద్ధి కుంట పడిందని అన్నారు. భవిష్యత్తులో పుల్లూరు బండను మరింత అభివృద్ధి చేస్తానన్నారు. వీరి వెంట దేవాలయ కమిటీ ఛైర్మెన్ కనకయ్య గౌడ్, మాజీ సర్పంచ్ పల్లె నరేష్ గౌడ్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పదిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి

-మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ రెడ్డి

నవతెలంగాణ-రాయపోల్



పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు ఇష్టపడి చదువుతూ వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ రెడ్డి, తహసీల్దార్ దివ్య,ఎస్ఐ రఘుపతి అన్నా రు. శనివారం మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులకు అల్పాహారం ఏర్పాటు చేయడం జరిగిందని, మండలంలో 261 విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారని వీరికి మార్చి 20 వరకు అల్పాహారం అందజేయడం జరుగుతుందన్నారు. అలాగే పాఠశాల విద్యార్థులతో రాయపోల్ పోలీస్ జట్టు వాలీబాల్ క్రీడలు ఆడి విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని క్రీడలు శారీర దృఢత్వానికి మానసికోల్లాసానికి దోహదపడతాయన్నారు. గ్రీన్ స్కూల్ కాన్సెప్ట్‌లో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు భోజనం వంట చేయడానికి కట్టెల పొయ్యి ఉండడంతో తహసిల్దార్ దివ్య ఎస్సై రఘుపతి పెద్ద గ్యాస్ స్టవ్, రెండు సిలిండర్లు పాఠశాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగరాజు, పాఠశాల ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, సిఆర్పిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి హామీకి మొండి చేయి

- డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్



నవతెలంగాణ-మిరుదొడ్డి

కేంద్ర బడ్జెట్‌లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి మళ్ళీ మొండి చెయ్యి చూపి కూలీలను దగా చెసిందని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసె కుట్రలో భాగమే ఒక్క రూపాయి పెంచలేదన్నారు. 2024-25 బడ్జెట్‌లో ఉపాధి హామీకి గత బడ్జెట్ లో కేటాయించిన రూ.86వేల కోట్ల మాత్రమే కేటాయించారన్నారు. ప్రస్తుతం కేటాయించిన బడ్జెట్ లో గత సంవత్సరంలో చెల్లింపులకు పొగా మిగిలేది చాల తక్కువ గానె వుంటదన్నారు. దేశ వ్యాప్తంగా 740 జిల్లాలో 7,186,927 గ్రామాల్లో 14.55 కోట్ల ఉపాధి హమి జాబ్ కార్డు కలిగిన కుటుంబాలకు ఈ బడ్జెట్ వల్ల పనుల కల్పించలేక అర్ధాకాలికి గురి కాకతప్పదన్నారు. బడ్జెట్‌ను సవరించి రూ.3లక్షల కోట్లు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి రూ.10వేల కోట్లు కేటాయించా లన్నారు. ప్రస్తుతం కూలీలకు అమలవుతున్న రూ.2 లక్షల ప్రమాద భీమాను రూ.10లక్షలకు పెంచాలని, రైతు భీమా లాగా కూలీ భీమా పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సీఎం సహాయ నిధికి ఆసుపత్రి ఖర్చులు రావడం లేదు

- కేసీఆర్‌ను విమర్శించడం విడ్డూరం
- ఎఫ్డీసీ మాజీ ఛైర్మెన్ ప్రతాప్ రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

పేదలకు ఆసుపత్రులు ఖర్చులు కూడా సీఎం సహాయ నిధి ద్వారా పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వడం లేదనిఎఫ్డీసీ మాజీ ఛైర్మెన్ వంటేరు ప్రతాప్ రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభు త్వంలో సీఎం సహాయ నిధి కింద దరఖాస్తు చేసుకున్న మంజుల ప్రవీణ్, నెమటోరి కనకలక్ష్మి, రేఖ, సులేమాన్, స్వరూప, ఉప్పరి మల్లేష్, చిలకమ్మాలతో సహా 36 మందికి చెక్కులను అందజేసినట్లు తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభు త్వం సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయడంలో సైతం కోతలు విధిస్తుందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి గరిష్ట మొత్తంగా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు నవాజ్ మేరా, మండల అధ్యక్షుడు బెండ మధు, వేలూరు వెంకట్ రెడ్డి, ఎంపీపీ లతా రమేష్ గౌడ్, గజ్వేల్ ఆత్మ కమిటీ మాజీ ఛైర్మెన్ ఉడెం కృష్ణారెడ్డి, తదితరులున్నారు.

కేసీఆర్‌ను విమర్శించడం విడ్డూరం..

సీఎం రేవంత్ రెడ్డి పాలన చేతకాక కేసీఆర్ పై వాక్యాలు చేయడం విడ్డూరమని ఎఫ్డీసీ మాజీ ఛైర్మెన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పట్టుకున్నది కట్టే కాదని కారు స్టీరింగ్ అని ఆయన అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఒళ్ళు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని కేసీఆర్ చెప్పిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో అవినీతి ఏరులై పారుతోంది అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో నాయకులు మధు, కృష్ణారెడ్డి, నవాజ్, మాజీ కౌన్సిల్ సభ్యులు చందనా రవీందర్, పంబాల అర్చన, పాల్గొన్నారు.

పలు కార్యక్రమాల్లో పాల్గొన్న హరీశ్ రావు

- హనుమాన్ భక్త బృందం సేవా అభినందనీయం
- ఉర్సు ఉత్సవాల్లో ...
- మల్లారెడ్డిని అభినందించిన హరీశ్‌రావు





నవతెలంగాణ-సిద్ధిపేట

సిద్ధిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతి మంగళవారం, శనివారం సిద్ధిపేట రామ రాజు రావి చెట్టు హనుమాన్ దేవాలయం భక్త బృందం ఆధ్వర్యంలో ఆసుపత్రి పెషేంట్స్‌కు, వారి సంబంధించిన అటెండర్స్‌కు నిర్వహించె అన్నదాన కార్యక్రమాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మానవ సేవయే మాధవ సేవా అనే విధంగా అన్నదానాలకు కేరాఫ్ అడ్రెస్‌గా ఆ భక్త బృందమని, అదే స్పూర్తితో ఆసుపత్రికి వచ్చే పేద వారికి అన్నం పెట్టె కార్యక్రమం చేయడం అభినందనీయమన్నారు. పేషంట్స్‌కు అన్నం పెట్టి ఆప్యాయంగా పలకరించారు. ఆసుపత్రి సౌలత్ ల పై అడిగి తెల్సుకున్నారు. ఈ కార్యక్రమంలో భక్త బృందం పాల్గొన్నారు.



ఉర్సు ఉత్సవాల్లో.. పట్టణంలోని ముర్షిద్ గడ్డ దర్గా ఉర్సు ఉత్సవాల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు పాల్గొని ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఠాధిపతి ఖాజా మహమ్మద్ హకీమ్ షరీఫ్ చిష్తి, మాజీ మున్సిపల్ ఛైర్మెన్ రాజనర్సు, ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మల్లారెడ్డిని అభినందించిన హరీశ్‌రావు.. తెలంగాణ రాష్ట్రంలో బడ్జెట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ నూతన సంఘానికి ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన రాష్ట్ర జనరల్ సెక్రెటరీ జగ్గు మల్లారె డ్డిని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అభినం దించారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బిస్మాట్ స్టేట్ జనరల్ సెక్రటరీ జగ్గు మల్లారెడ్డి మర్యాదపూర్వకంగా మాజీ మంత్రి హరీశ్ రావుని కలిశారు. ఆయన మాట్లాడుతూ బిస్మాట్ నూతన సంఘానికి తమ సంపూర్ణ మద్దతు ఎల్లవేళలా ఉంటుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రయివేట్ పాఠశాలలు నాణ్యమైన బోధనను అందించి, విద్యార్థులను భావిభారత పౌరులుగా తయారు చేయడంలో ముందు వరసలో నిలవాలని కోరా రు. ప్రయివేట్ పాఠశాలల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్ళి, పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిస్మాట్ జిల్లా ప్రతినిధులు సంపత్ కుమార్, భగవాన్ రెడ్డి, రమేష్, రవీందర్ రెడ్డి, శ్రీకాంత్, సత్యం పాల్గొన్నారు.

పేద ప్రజలకు ఎంతో సహకారంగా సీఎం సహాయ నిధి







నవతెలంగాణ-దౌల్తాబాద్


నిరుపేద ప్రజలకు సీఎం సహాయ నిధి పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పంజా స్వామి అన్నారు. శనివారం మండలంలోని గాజులపల్లి గ్రామంలో లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన పోతుగంటి పుష్పమ్మ రూ.28,500, పోతుగంటి శకుంతలకు రూ.7 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశామన్నారు. నియోజక వర్గంలో ఎవరైనా సరే అనారోగ్యానికి గురైనప్పుడు సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకొని లబ్ది పొందాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బ్రహ్మానంద రెడ్డి,ఏసు,నర్సింలు, లక్ష్మారెడ్డి, నర్సింలు, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-నంగునూరు ..సీఎం సహాయ నిధి పేదలకు గొప్ప వరమని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి అన్నారు. శనివారం మండలంలోని గట్లమల్యాల గ్రామంలో కర్ణకంటి గోవిందాచారికి సీఎం సహాయ నిధి నుంచి వచ్చిన రూ.37,500ల చెక్కును కాంగ్రెస్ మండల అధ్యక్షులు తప్పెట శంకర్, మాజీ సర్పంచ్ తిప్పని రమేశ్, మండల పార్టీ ఉపాధ్యక్షులు గాండ్ల రమేశ్ లతో కలిసి భాధితునికి అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ పెద్ద భరోసా కల్పిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎనగందుల యాదగిరి, బాగు శ్రీకాంత్ యాదవ్, జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, గోనెపల్లి శివ ప్రసాద్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం, సరుకుల అందజేత







నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన మంగి ఎల్లయ్య (65) అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. శనివారం మాజీ ఎంపీపీ పాండు గౌడ్ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బేతి మధుసూదన్ రెడ్డి, బీఆర్ఎస్ యూత్ నాయకులు కరుణాకర్, మేకల శ్రీనివాస్, బాలస్వామి, బాయికాడి వెంకటేష్, తాడెం బాబు, సాయికుమార్, నర్సింలు ,తదితరులున్నారు.

నవతెలంగాణ-నంగునూరు : మండలంలోని రాజగోపాల్ పేట గ్రామానికి చెందిన గోవిందారం బాల్ నర్సు ఇటీవలే మృతి చెందాడు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు సహకారంతో గ్రామ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, యువకులు కలిసి ఆ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసి పరామర్శించారు.

నవతెలంగాణ-తొగుట: మండలంలోని తుక్కాపూర్ గ్రామానికి చెందిన లింగాల స్వామి ప్రమాదవశాత్తు కొద్ది రోజుల క్రితం మృతి చెందాడు. శనివారం లింగాల స్వామి కుటుంబాన్ని ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ చిక్కుడు స్వామి పరామర్శించి, రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మంతూరు స్వామి, గొడుగు శ్రీశైలం, బోయిని బాల రాజు, లింగాల కృష్ణ, బొంబాయి వెంకటి, లింగల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

50కిలోల బియ్యం.. మండలంలోని తుక్కాపూర్ గ్రామానికి చెందిన లింగాల స్వామి కొద్దిరోజులు క్రితం ప్రమాదవశాత్తు డ్రైనేజీలో పడి మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుని కుటుంబ సభ్యులను ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఉల్లెంగల సాయి కుమార్ పరామర్శించి 50 కిలోల బియ్యాన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు లింగాల కృష్ణ, కాంగ్రెస్ గ్రామ కమి టీ అధ్యక్షుడు బర్రింకల స్వామి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు చిక్కుడు గోపాల్, తదితరులు పాల్గొ న్నారు.



ప్రత్యేక తరగతులను సందర్శించిన విద్యాధికారి

నవతెలంగాణ-దౌల్తాబాద్

పదవ తరగతి విద్యార్థులు పది జీపీఏ గ్రేడ్ సాధించేందుకు అభ్యాసం కొనసాగించాలని వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి ప్రణాళికబద్ధంగా చదువుకోవాలని మండల విద్యాధికారి గజ్జల కనకరాజు అన్నారు. శనివారం దౌల్తాబాద్ మండల కేంద్రం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రత్యేక తరగతులను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నిర్వహిస్తున్నటువంటి ప్రత్యేక తరగతులను పరిశీలిస్తూ విద్యార్థులకు తగు సూచనలు చేయడం జరిగిందన్నారు. కనీసం పాఠశాల నుంచి పదిమంది విద్యార్థులైన 10 జీపీఏ సాధించాలని సూచించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు దశరథం,సి.ఆర్. పి.రాజు పాల్గొన్నారు.



సోనియా గాంధీ క్షమాపణలు చెప్పాలి

నవతెలంగాణ-అక్కన్నపేట



రాష్ట్రపతి ద్రౌపది ముర్ముపై కాంగ్రెస్ ఎంపీ సోనియాగాంధీ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ, అక్కన్నపేట మండల కేంద్రంలో బీజేపీ గిరిజన మోర్చా ఆధ్వర్యంలో శనివారం కాంగ్రెస్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు రామంచ మహేందర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ.. కేంద్రంలో ప్రధాని మోడీ రాజ్యాంగబద్ధంగా పదవులు అన్ని వర్గాలకు అందాలని ఆదివాసి మహిళా అయినటువంటి ద్రౌపతి ముర్ముకు రాష్ట్రపతి పదవిని అందించారని తెలియజేశారు. దాన్ని జీర్ణించుకోలేక కాంగ్రెస్ వాళ్ల అవాకులు చవాకులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఒక ఆదివాసి బిడ్డను అవమానపరిచిన సోనియా గాంధీ తక్షణమే క్షమాపణలు చెప్పాలని లేనిపక్షంలో దేశవ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ జనగామ వేణుగోపాలరావు, మండల ప్రధాన కార్యదర్శులు చెరుకు సంపత్, మడక రవి, ఎస్టి మోర్చా అధ్యక్షుడు సురేష్ రైనా, గిరిజన నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ క్రికెట్‌కు ఎంపికైన విరాట్ ఆనంద్ అకాడమీ

నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

దుబాయ్ కంట్రీలోని షార్జా నగరంలో జరుగుతున్న ఇంటర్నేషనల్ క్రికెట్ టోర్నమెంట్‌కు సిద్దిపేటకు చెందిన విరాట్ ఆనంద్ క్రికెట్ అకాడమీ స్టూడెంట్లు పవన సుత హనుమాన్, లక్ష్మి మనికాంత్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శనివారం సిద్దిపేట పట్టణంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విరాట్ ఆనంద్ క్రికెట్ అకాడమీ కోచ్ ముత్యాల ఆనంద్ తోపాటు, టోర్నమెంట్ గెలుపు



కైనా స్టూడెంట్ లను అభి నం దిం చా రు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరుకున్నారు.

ముందస్తు అడ్మిషన్లు తీసుకుంటున్న స్కూల్ పైన చర్యలు తీసుకోవాలి

-ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కొండం సంజీవ్ కుమార్

నవతెలంగాణ-సిద్దిపేట :

సిద్దిపేటలో ముందస్తు అడ్మిషన్స్ చేస్తున్న శ్రీ చైతన్య, నారాయణ, ఇతర స్కూళ్ల పైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కొండం సంజీవ్ కుమారు విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేశారు. శనివారం అయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ముగియక ముందే ముందస్తు అడ్మిషన్ చేస్తు పేద విద్యార్థుల కుటుంబాలు దగ్గరికి వెళ్లి వసంత పంచమి పేరిటా అడ్మిషన్ చేస్తే, అడ్మిషన్ 50 శాతం మాఫీ అని చెప్పి విద్యార్థి కుటుంబాల తల్లిదండ్రులను మభ్య పెడుతున్నారన్నారు. ఇప్పటి నుంచి తల్లిదండ్రులను మభ్యపెడుతూ అడ్మిషన్లు తీసుకుంటున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

IN THE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE AT HANUMAKONDA
I.A.NO.1879OF 2022
IN O.S.NO. 96 OF 2014

Between:
P.Muralidhar Reddy
...Petitioner/Plaintiff
And
Smt.P.Vijaya Lakshmi and others.
...Respondents/Defendants

To
R-9) Madadi Madhava Reddy, S/o late M.Sudershan Reddy, age: 40 years, Occu: Physiotherapist, R/o Rama varam Village, Husnabad Mandal, Anthakapeta, Siddipet District.

NOTICE

The petitioner filed I.A.No.1879 of 2024 U/Sec.5 of Limitation Act, to condone delay of (71) days, i.e. from 24-5-2024 to 2-8-2024 in filing Application U/O.XXII R.4 C.P.C., to bring the legal heirs of respondent/ defendant No.6 on record as defendant Nos.8 and 9 in his place, in the said suit and you are the proposed defendant No.9 in the suit. The said I.A.No. 1879 of 2022 is posted on 21-2-2025 for your appearance.

Please take notice that, you shall appear either in person or through advocate on 21-2-2025, at 10:30 A.M before the said Hon'ble court, failing which, the matter will be decided in your absence.

// BY ORDER OF THE COURT //
A. LAXMINARAYANA REDDY
ADVOCATE
Hanumakonda
Dated:1-2-2025. Cell:9866048606

విద్యార్థులు వివేకానందున్ని ఆదర్శంగా తీసుకోవాలి



నవతెలంగాణ-చేర్యాల

విద్యార్థులు వివేకానందుని ఆదర్శంగా తీసుకోవాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ ఇంద్రజీత్ సుష్మీత్ అన్నారు. రామకృష్ణ సేవాసమితి సిద్దిపేట వారి ఆధ్వర్యంలో మండల పరిధిలోని కడవేర్గు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం వ్యక్తిత్వ వికాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంద్రజీత్ సుష్మీత్ విద్యార్థులకు శారీరక మానసిక ఆరోగ్యం పై అనేక విషయాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యం కలిగి ఉండాలని, ధృడమైన శరీరంలో ధృడమైన మనసు కలిగి ఉండాలన్నారు. భయం లేకుండా పరీక్షలు వ్రాయడానికి కొన్ని ఉపయోగకర చిట్కాలు తెలియజేశారు. అనంతరం ఇంద్రజిత్ సుస్మిత్ ను ఉపాధ్యాయ బృందం శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలోప్రధానోపాధ్యాయులు పి.ఎస్.చంద్రశేఖర్ రావు, ఉపాధ్యాయులు రమేశ్ ,కృష్ణమూర్తి, రామకృష్ణ, లింగయ్య, కాంతికృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాలను సందర్శించిన ఏఈలు

నవతెలంగాణ-మర్కుక్ : వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడడానికి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గిరిధర్, డివిజన్ ఇంజనీర్ ప్రవీణ్, అసిస్టెంట్ ఇంజనీర్ భాను ప్రియ శనివారం గ్రామాలను మర్కుక్ ఎంపీడీవో అశోక్‌తో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మండల ంలోని పాతూరు, ఇప్పగూడెం గ్రామాల్లో వాటర్ ట్యాంకులను, త్రాగునీటి వసతుల వివరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శాంతి, పంచాయతీ కార్యదర్శులు సంగీత,నీలిమా, ఉన్నారు.



ఎస్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండల కేంద్రంలో ఎస్‌టీయు క్యాలెండర్‌ను ఎంఈఓ మీనా ఆంజనేయులు శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దూల్మిట్ట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కరుణాకర్ రెడ్డి, చేర్యాల మండలం ఎస్‌టీయూ అధ్యక్షులు కర్రోల్ల స్వర్ణకుమర్ , మద్దూరు మండలం కోశాధికారి సలేంద్రి యాదగిరి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం

-ప్రిన్సిపాల్ కె.విశ్వనాథ్

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



హుస్నాబాద్ మోడల్ స్కూల్‌లో 6 తరగతి నుంచి 10వ తరగతి వరకు 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయినట్లు ప్రిన్సిపాల్ కె.విశ్వనాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి 100 సీట్లు, 7 నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను ప్రవేశ పరీక్ష ద్వారా భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తుదారులు తప్పనిసరిగా దరఖాస్తు ప్రక్రియను ఆన్‌లైన్‌లో సంబధిత వెబ్‌సైట్ లో పూర్తి చేయాలి. దరఖాస్తు రుసుము ఓసి రూ.200, బీసీ ఎస్సీ ఎస్టీ పి.హెచ్.సి , ఈడబ్ల్యూఎస్ మైనారిటీ రూ.125 ఉంటుందన్నారు. 13 ఏప్రిల్ 2025 న పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు

రాష్ట్రస్థాయి ఇంగ్లీషు ఒలంపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-సిద్ధిపేట

రాష్ట్రస్థాయి ఇంగ్లీషు ఒలంపియాడ్, ఉపన్యాస పోటీలు అనురాగ్ యూనివర్సిటీలో నిర్వహించగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇందిరానగర్ కు చెందిన 9వ తరగతి విద్యార్థిని సానియా సదాఫ్ ఇంగ్లీష్ ఒలంపియాడ్ విభాగంలో రాష్ట్ర స్థాయి రెండవ బహుమతితో పాటు, క్యాష్ ప్రైస్ రూ.3వేలు, మెడల్ గెలుచుకున్నట్లు పాఠశాల హెచ్‌ఎం రాజా ప్రభాకర్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ రమేష్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నట్లు తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి విద్యార్థిని, ఆంగ్ల బృందమును అభినందించారు.

గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

-కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజుమ్

నవతెలంగాణ-గజ్వేల్



5న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో (ఆటోనామస్)లో రసాయన శాస్త్ర విభాగంలో జాబ్ మేళను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ నికిత్ అంజుమ్ తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ..ఇందులో సదాశివపేటకి చెందిన ఎవరెస్టు ఆర్గానిక్స్ లిమిటెడ్ సంస్థ వారు పాల్గొననున్నారని తెలిపారు. వారి సంస్థలో ట్రైనీ తదితర ఉద్యోగాలకి ఖాళీలు ఉన్నాయని, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులైన ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ సర్టిఫికెట్స్, చిరునామతో రెజ్యూమ్‌లతో మేళాలో పాల్గొనాలని ఆమె కోరారు. పూర్తి వివరాలకు 9381557831 నెంబర్‌ను సంప్రదించాలని ఆమె తెలిపారు.


కాంగ్రెస్ యూత్ రాష్ట్ర అధ్యక్షుడికి ఘన సన్మానం



నవతెలంగాణ-సిద్ధిపేట

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరన్ రెడ్డిని హైదరాబాద్‌లో కలిసి ఘనంగా సన్మానించినట్లు రాష్ట్ర నేత పూజల గోపీ కృష్ణ, అసెంబ్లీ అధ్యక్షుడు వాహబ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 4న గాంధీభవన్‌లో నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఉంటుందని, రాష్ట్రంలోని యువత హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పవన్, రసాత్, కర్ణాకర్, అజ్మత్, తదితరులు పాల్గొన్నారు.

వదువు వివాహానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-తొగుట

మండలంలోని తుక్కాపూర్ గ్రామం, నిరుపేద కుటుంబానికి చెందిన బర్రింకల కిష్టవ్వ రాములు కూతురు శివాని వివాహానికి చిక్కుడు స్వామి (ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్) తనవంతు రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

ఢిల్లీ, బీహార్ రాష్ట్రల కోసమే కేంద్ర బడ్జెట్

నవతెలంగాణ-గజ్వేల్



2024-25 బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ కి ఇప్పుడు ఎన్నికలున్న రాష్ట్రాలు ఢిల్లీ, బిహార్ రాష్ట్రాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చిన విధంగా తెలంగాణకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం దారుణం అని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండ స్వామి అన్నారు. శనివారం కేంద్ర బడ్జెట్ ఆయన మాట్లాడుతూ.. బీజేపీ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులుండి కేంద్ర బడ్జెట్ ద్వారా నిధులు రాబట్టుకోవడంలో దారుణంగా విఫలమయ్యారు. కేంద్రానికి మద్దతు పలికిన జనతాదళ్ (యూ) బీహర్ లో బడ్జెట్ లో మఖాన బోర్డు,మిథిలాంచల్ వెస్టర్న్ కోసి కెనాల్, ఐఐటీ పాట్నా విస్తరణ, బిహార్ గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. కాని నమ్మి ఒట్లు వేసి గెలిపించిన తెలంగాణ ను మోసం చేశారు.

ఎమ్మెల్సీ ఎలక్షన్స్ కోసం రాజకీయ ప్రతినిధులతో సమావేశం

నవతెలంగాణ-సిద్దిపేటకలెక్టరేట్



జిల్లా కలెక్టరేట్‌లో కరీంనగర్-అదిలాబాద్-నిజామాబాద్-మెదక్ పట్టభద్రుల నియోజకవర్గ, ఉపాధ్యాయ నియోజకవర్గ , వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎలక్షన్ సంబంధిత ప్రక్రియలో భాగంగా రాజకీయ పార్టీ ప్రతినిధులతో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమిద్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశం ఆయన మాట్లాడుతూ.. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఈ ఎమ్మెల్సీ ఎలక్షన్ నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేసింది కావునా ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున వివిధ రాజకీయ పార్టీలు ఈసీఐ సూచించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎలక్షన్ లాగానే ఈ ఎమ్మెల్సీ ఎలక్షన్లు ఉంటాయనే అభిప్రాయాన్ని తుడిచిపెట్టి ఎమ్మెల్సీ ఎలక్షన్ ప్రక్రియ భిన్నమైన పద్ధతీలో ఉంటుందన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చెయ్యడం, వివిధ ఫంక్షన్ల పేరుతో పార్టీల మీటింగ్ పెట్టడం, ఓటర్లను దూరాభారం కోరకు పోలింగ్ స్టేషన్ వరకు తీసుకురావడం, పట్టభద్రుల, ఉపాధ్యాయుల కోసం పాఠశాలల్లో ప్రచారం చేయడం వంటివి జరగకుండా చూసుకోవాలని రాజకీయ పార్టీ ప్రతినిధులకు సూచించారు. అలాగే ఓటరు అప్లయ్ చేసుకున్న ప్రతి ఒక్కరి వివరాలను ఆయా స్థాయిల్లో వెరిపై చేశాకే ఫైనల్ లిస్ట్ వస్తుందని తెలిపారు. రాజకీయ పార్టీ ప్రతినిధులు అధికారులకు ఎమ్మెల్సీ ఎలక్షన్ ప్రక్రియ విజయవం తం చేసేందుకు మీ వంతు సహకారం అందించాలని తెలిపా రు. ఈ సమావేశంలో కలెక్టరేట్ ఎఓ అబ్దుల్ రహమాన్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ప్రభాస్, బీజేపీ ప్రతినిధి వీభుషన్ రెడ్డి, ఎంఐఎం పార్టీ ప్రతినిధి ఎండి. మునిద్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను అమ్మితే చర్యలు తప్పవు

నవతెలంగాణ-కోహెడ

మత్తుపదార్థాలను అమ్మితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెడ్ కానిస్టేబుల్ కనుకయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కిరాణా షాపులు, హెూటల్స్, ఇతర అనుమానస్పద ప్రాంతాల్లో నార్కోటిక్స్ డాగ్స్‌తో తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తుపదార్థాలు అమ్మినట్లుగా కనిపిస్తే వెంటనే 100కు లేనట్లయితే తెలంగాణ యాంటి నార్కటిక్స్ బ్యూరో టోల్ ఫ్రీ నంబర్ 1908కు సమాచారం అందించాలన్నారు. యువత తాత్కలిక ఆనందం కోసం జీవితాలు పాడుచేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్‌లు శంకర్, నవీన్‌కుమార్, తిరుపతి, నరేష్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది, తదితరులున్నారు.



కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండి చేయి

- ఓట్లు సీట్లు బీజేపీ ప్రథమ ప్రాధాన్యత
- సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్

నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్



కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణాకు మరోసారి తీరని అన్యాయం జరిగిందని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేక కేటాయింపులు ఏవీ లేవని, బీహార్ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అభివృద్ధి, ప్రత్యేక నిధుల కేటాయింపుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని, తెలంగాణ రాష్ట్రానికి ఐఐఎం ఐఐటీ,సైనిక్ పాఠశాలలు, కేంద్ర విద్యా సంస్థలు రావాల్సి ఉండగా అవేమీ పట్టించుకోలేదన్నారు. రాష్ట్రానికి చెందిన 8 మంది బీజేపీ ఎంపీలు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో విఫలమయ్యారన్నారు. అంకెలతో ఆదాయపు పన్ను మినహాయింపు మధ్యతరగతికి పెద్ద ఊరట అని బీజేపీ చేస్తున్న ప్రచారం అవాస్తవమని తెలిపారు. లక్షలాదిమంది యువకులకు ఉపాధి కల్పించే బయ్యారం ఉక్కు పరిశ్రమ ప్రాజెక్టును మూలకు పడేయడం దారుణం అన్నారు.కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ముందడుగు వేయడంలో అవసరమైన నిధులను కేటాంచలేదని, మణుగూరు నుంచి రామగుండం రైల్వే లైన్ పై పట్టించుకోలేదని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి సాగునీటి ప్రాజెక్ట్ కు జాతీయ హెూదానిచ్చి నిధులు కేటాయించాలనే డిమాండ్ ను పెడచెవిన పెట్టడం శోచనీయం.

అంకితభావంతో పనిచేస్తే పాఠశాలలు పటిష్టం

- ఎంఈఓ ప్రవీణ్ బాబు

నవతెలంగాణ-మిరుదొడ్డి

అంకితభావంతో పని చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తే ప్రభుత్వ పాఠశాలలు పటిష్టం అవుతాయని మిరుదొడ్డి మండల ఎంఈఓ ప్రవీణ్ బాబు అన్నారు. మిరుదొడ్డి మండలం అందే ప్రాథమిక పాఠశాల వారు వినూత్నంగా విద్యార్థుల ఫోటోలతో రూపొందించిన క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందే పాఠశాల ప్రజల భాగస్వామ్యంతో ఉపాధ్యాయుల వినూత్న కార్యక్రమాలతో ప్రయివేటుకు ధీటుగా తయారైందన్నారు. నాణ్యమైన విద్యను అందించడానికి ఈ పాఠశాలలో మంచి ఉపాధ్యాయ బృందం ఉందని తెలిపాడు. 106 మంది విద్యార్థులతో పాఠశాల నిర్వహణ అద్భుతంగా ఉందని తెలిపారు. విద్యార్థుల ఫోటోలతో క్యాలెండర్ రూపొందించిన పాఠశాల ఉపాధ్యాయులను ఎంఈఓ అభినందించాడు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఏపీసీ చైర్ పర్సన్ స్వర్ణ, అందె ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పురుమాండ్ల రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



కూడవెల్లి ఆదాయం రూ.3 లక్షల 95 వేలు

నవతెలంగాణ-దుబ్బాక



అక్బర్ పేట-భూంపల్లి మండలం రామేశ్వరంపల్లిలోని కూడవెల్లి రామలింగేశ్వరాలయ జాతర ఆదాయం రూ.3,95,372 సమకూరిందని ఈవో విశ్వనాథ శర్మ తెలిపారు. శనివారం దేవాదాయ ధర్మాదాయ శాఖ సిద్దిపేట డివిజన్ ఇన్ స్పెక్టర్ పీ.విజయలక్ష్మి పర్యవేక్షణలో ధర్మకర్తల మండలి, వికాస్ తరంగిణి సిద్దిపేట వారిచే జరిపిన హుండీ లెక్కింపులో గతేడాది కంటే ఈ ఏడాది రూ.1,26,780 ఆదాయం పెరిగింది. ఇదిలా ఉండగా వాస్తవ పరిస్థితులకు తగ్గట్టుగా ఆదాయం రావడంలేదని, ఇందులో కొంతమంది ఆలయానికి రావలసిన ఆదాయానికి గండి కొడుతున్నారని రామేశ్వరంపల్లి, కూడవెల్లి గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారులు నిఘా పెడితే ప్రతి ఏటా స్వామివారి జాతర ఆదాయం రూ.10 లక్షల వరకు సమకూరుతుందని చెబుతున్నారు. ఈ లెక్కింపు ప్రక్రియలో దేవదాయ శాఖ సిబ్బంది,ఆలయ చైర్మెన్ ఉషయ్యగారి రాజిరెడ్డి, డైరెక్టర్లు, అర్చకులు, పోలీసు సిబ్బంది,పలువురు పాల్గొన్నారు.

రుణం చెల్లించమంటే అసత్య ఆరోపణలు

- పీఏసీఎస్ చైర్మెన్ కైలాష్

నవతెలంగాణ-దుబ్బాక

గతంలో తీసుకున్న రుణం చెల్లించమంటే లంచం తీసుకున్నారంటూ ఓ రైతు సోషల్ మీడియాలో తమ అధికారులపై అసత్య ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పీఏసీఎస్ చైర్మెన్ శేర్ల కైలాష్ అన్నారు. శనివారం దుబ్బాకలోని పీఏసీఎస్ కార్యాలయంలో వైస్ చైర్మెన్ కాల్వ నరేష్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. దుబ్బాక పట్టణ కేంద్రానికి చెందిన ఓ రైతు తన తల్లి పేరు పైనున్న క్రాప్ లోన్, ఎల్‌టీ లోన్ కు సంబంధించిన వడ్డీ డబ్బులు కట్టలేదన్నారు. రుణమాఫీ డబ్బులు పోను రూ.16,205 కడితే పట్టా పాసు బుక్కు ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు. సొసైటీకి బాకీ ఉన్న డబ్బులు చెల్లించమంటే లంచం అడుగుతున్నారని అసత్య ప్రచారాలు చేయడం తగదన్నారు. రుణానికి సంబంధించిన పూర్తి డబ్బులు చెల్లించి పట్టా పాస్ బుక్కులు తీసుకోవాలని కోరారు. పీఏసీఎస్ సీఓ మోహన్, సిబ్బంది కర్ణాకర్ ఉన్నారు.



7న చలో 'వేల గొంతులు- లక్ష డప్పులు' మహా ప్రదర్శన

- లక్ష డప్పుల పోగ్రం రాష్ట్ర చీఫ్ కో ఆర్డినేటర్ అందె భాస్కర్ మాదిగ

నవతెలంగాణ-గజ్వేల్

కోట్లాది మంది ప్రజల ఆకాంక్ష అయిన ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఫిబ్రవరి 07న మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో నిర్వహించ తలపెట్టిన వెయ్యి గొంతులు లక్ష డప్పులు మాదిగల సాంస్కృతిక మహా ప్రదర్శన కార్యక్రమానికి గజ్వేల్ నియోజకవర్గంలోని మాదిగలంతా పార్టీలకు సంఘాలకు అతీతంగా తరలి రావాలని లక్ష డప్పుల పోగ్రాం రాష్ట్ర చీఫ్ కో ఆర్డినేటర్ అందె భాస్కర్ మాదిగ పిలుపునిచ్చారు. శనివారం గజ్వేల్ కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద వెయ్యి గొంతులు లక్ష డప్పుల ప్రదర్శన వాల్ పోస్టర్స్ ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎం ఈ ఎఫ్ సీనియర్ నాయకులు మాసపాక కనకయ్య మాదిగ దమ్మని మల్లయ్య మాదిగ ,ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు మైస రాములు మాదిగ,ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముం ద్రాతి కృష్ణ మాదిగ, సీనియర్ నేత కర్రోల్ల కనకయ్య మాదిగ, తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా పుల్లూరు బండ జాతర ముగింపు

- చివరి రోజు సంప్రదాయ బద్దంగా చక్ర స్నానం

నవతెలంగాణ-సిద్దిపేటరూరల్



స్వయంభూ లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రం పుల్లూరు బండపై ఐదు రోజుల పాటు వైభవంగా జరిగిన జాతర చివరి రోజైన శనివారం దేవాలయ వంశపారంపర్య అర్చకులు సంప్రదాయ బద్దంగా నిర్వహించిన చక్ర స్నానం కార్యక్రమంతో ముగిసింది. చివరి రోజు సుదర్శన నారసింహ హెూమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం సుదర్శన చక్ర పెరుమాళ్ ఉత్సవమూర్తిని, యాగ జలాన్ని తీసుకు వెళ్లి బండపై ఉన్న పవిత్ర పాలగుండం లక్ష్మీ నరసింహస్వామి గుండాల్లో జలానికి శుద్ధి పూజలు నిర్వహించారు. దీంతో 5 రోజుల పాటు జరిగిన పుల్లూరు స్వయంభూ లక్ష్మీ నరసింహస్వామి స్వామి బండ జాతర ఘనంగా ముగిసింది. దేవాలయ కమిటీ చైర్మెన్ కనకయ్య గౌడ్, వంశ పారంపర్య అర్చకులు కలకుంట్ల రంగాచార్యులు కుటుంబ సమేతంగా కార్యక్రమాలను నిర్వహించారు.

నేడు జాతీయ సాహిత్య పరిషత్ వార్షికోత్సవం

నవతెలంగాణ-సిద్ధిపేట

నేడు జాతీయ సాహిత్య పరిషత్ 38వ వార్షికోత్సవం సాయంత్రం 4 గంటలకు పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ లో కలదని జాతీయ సాహిత్య పరిషత్ ప్రధాన కార్యదర్శి ఉంద్రాళ్ళ రాజేశం, సభ్యులు నల్ల అశోక్ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ జాతీయ సాహిత్య పరిషత్ వార్షికోత్సవం సందర్భంగా సాహిత్య పురస్కారాలతో పాటుగా, పుస్తకావిష్కరణ కార్యక్రమం కలదని, అతిధులుగా జాసాప రాష్ట్ర అధ్యక్షులు వడ్లూరి ఆంజనేయరాజు, ఉపాధ్యక్షులు గాజుల రవీందర్ లు హాజరవుతారని అన్నారు. వార్షికోత్సవ కార్యక్రమానికి కవులు, రచయితలు, సాహితీ ప్రియులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.



'వేల గొంతులు-లక్షల డప్పులు' ను విజయవంతం చేయాలి

- ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్

నవతెలంగాణ-దౌల్తాబాద్

లక్షల డప్పులు వేల గొంతుల కార్యక్రమానికి మాదిగ మాదిగ ఉపకులాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్ అన్నారు. శనివారం దౌల్తాబాద్ మండలం గువ్వలేగి గ్రామంలో డప్పుచప్పులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 7వ తేదీన హైదరాబాదులో జరిగే కార్యక్రమానికి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి రాజ మల్లయ్య, జిల్లా ఉపాధ్యక్షులు జంగపల్లి సాయిలు, తదితరులు పాల్గొన్నారు.



రాయపోల్ మండలం ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-రాయపోల్

మండలం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నూతన కమిటీని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుర నర్సింలు, రాష్ట్ర సీనియర్ నాయకులు మైస రాములు, జిల్లా అధ్యక్షులు ముంద్రాతి కృష్ణ, జిల్లా కార్యదర్శి ఉబ్బని ఆంజనేయులు, ఎం ఈ ఎఫ్ రాష్ట్ర నాయకులు చేబర్తి యాదగిరి ఆధ్వర్యంలో ఎన్నుకోన్నారు. శనివారం మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ రాయపోల్ మండల అధ్యక్షులు వడ్డేపల్లి గ్రామానికి చెందిన అయ్యగల్ల రవి, ఉపాధ్యక్షులు మంతూర్ గ్రామానికి చెందిన బందారం సంతోష్, రాయపోల్ మాసాన్ పల్లి రాజు, ప్రధాన కార్యదర్శి టెంకంపేట నర్సింలు, కొత్తపల్లి మల్లేశం, కోశాధికారి రాంసాగర్ కొనింటి లక్ష్మణ్, సలహాదారులు ఉషనగల్ల శ్రీనివాస్ (ఆంధ్రప్రభ), మాజీ సర్పంచ్ రామోల్ల స్వామి, గజ్వేల్ రాంచంద్రం, మన్నే గణేష్(ప్రజాకలం), ఉషనగల్ల నర్సింలు లు ఎన్నికయ్యారు. అనంతరం లక్ష డప్పులు, వేల గొంతకలు గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం నూతన మండల అధ్యక్షులు రవి మాట్లాడారు. కార్యక్రమంలో యాదగిరి, స్వామి తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణపై కేంద్రానిది పక్షపాతమే

- జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి రాజశేఖర్ రెడ్డి
- బడ్జెట్‌లో రాష్ట్రానికి కేంద్రం తీవ్ర అన్యాయం చేసిందని మండిపాటు

నవతెలంగాణ-బెజ్జంకి



తెలంగాణపై కేంద్ర ప్రభుత్వానిది పక్షపాతమేనని బడ్జెట్ లో రాష్ట్రంలోని ఒక్క ప్రాజెక్టుకు నిధులు కేటాయించకపోవడం వివక్షతకు నిదర్శనమని జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి పోతిరెడ్డి రాజశేఖర్ రెడ్డి శనివారం ఆరోపించారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు 8మంది బీజేపీ ఎంపీలను ఎన్నుకుంటే రాష్ట్రానికి నిధులు తీసుకురావడంలో విఫలమయ్యారని, కేంద్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని రాజశేఖర్ రెడ్డి మండిపడ్డారు. తెలంగాణ బీజేపీ నాయకులకు రాష్ట్ర అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే విభజన హామీలు, ఐటీఆర్, ఐఐఎం, రైల్వే ప్రాజెక్టులకు రావాల్సిన నిధుల వాటాను తెచ్చి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని రాజశేఖర్ రెడ్డి సూచించారు.